వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

బుధవారం 24 జూలై 2024


# భూ కబ్జాలపై విచారణ చేపట్టాలి

## రెవెన్యూ మంత్రిని కలిసిన రితీష్ రెడ్డి

**బద్వేలు, జూలై 23 ప్రభాతవార్త :**

బద్వేలులో భూ కబ్జాలు, ఆక్రమణలు ఎక్కువ కావడంతో వాటిపై విచారణ చేపట్టి ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోవాలని తెలుగుదేశం సమన్వయకర్త యువనేత రితేష్‌రెడ్డి రెవెన్యూ శాఖమంత్రి సత్య ప్రసాద్‌ను కలిసి విన్నవించారు. బద్వేలులో భూ కబ్జాలు , ఆక్రమణలు ఎక్కువ కావడంతో నిత్యం నాయకులు కొందరు వ్యక్తులు భూ కబ్జాలకు పాల్పడిన విషయం తెలిసిందే. గత ఎన్నికల ప్రచార సమయంలో బద్వేలులో జరిగిన ఆక్రమణలను వెలికితీస్తానని టీడీపీ అధికారంలోకి వచ్చిన 100 రోజులలో భూ కబ్జాలపై ప్రత్యేక దృష్టి పెడతానని చెప్పిన మాట ప్రకారం యువనేత రితేష్‌రెడ్డి ముందుగానే స్పందించి రెవెన్యూ శాఖ మంత్రిని కలిసి బద్వేలులో జరిగిన వ్యవహార శైలిని వివరించారు. కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాల వెనక్కు తీసుకోవడమే కాకుండా పేదల స్థలాలను కబ్జా చేసిన వారందరికీ వెనక్కు స్థలాలు వచ్చేలాచేస్తానని మాట ఇచ్చారు.ఈ మాట ప్రకారం బద్వేలు నియోజకవర్గంలో కబ్జాలపై విచారణ చేపట్టాలని రితేష్‌రెడ్డి కోరారు. నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యల గురించి వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే చర్యలు చేపడతామని మాట ఇచ్చారు.

# తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

**ఖాజీపేట, జూలై 23, ప్రభాతవార్త:** ఖాజీపేట మండలానికి సంబంధించి 18వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం ఎమ్మార్వో కార్యా లయా ఆవరణంలో జరిగింది. డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ అధ్యక్షతన జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక తూతూ మంత్రంగా సాగింది. మండలంలోని 21పంచాయతీల పరిధిలో జూలై 08 నుంచి సోమవారం వరకు సామాజిక తనిఖీ జరిగింది. ఆయా పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులు, పింఛన్ల పంపిణీకి సంబంధించి ప్రజల నుంచి సేకరించిన వివరాలను ఉపాధి సర్వే టీం మంగళవారం జరిగిన ప్రజా వేదికలో నివేదికల రూపంలో బహిర్గతపరిచింది. ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి ఖాజీపేట పంచాయతీలోని ఉపాధి హామీ అవకతవకలపై ప్రశ్నించగా అడిషనల్ పిడి నాగరత్నమ్మ విచారణ జరిపిస్తామని తెలిపారు. 2023-24 ఏడాదికి సంబంధించి జరిగిన సోషల్ ఆడిట్‌లో మొత్తంగా రూ.లక్షా 19వేల రూపాయలను రికవరి చేసినట్లు అధికారులు వెల్లడించారు. మండల పరిధిలోని బి.కొత్తపల్లె పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై ప్రజావేదికలో గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. గ్రామంలో పనులు చేపట్టకపోగా.. సొంత బంధుగణానికి మేలు చేకూరు స్తున్నా డని ఫైర్ అయ్యారు. తనకు నచ్చిన వారికే వంద రోజుల పనికల్పిస్తూ..నచ్చనివారికి ఏడాదిలో కేవలం 30-40 రోజుల పనిమాత్రమే కల్పిస్తున్నాడనివాపోయారు. దీనిపై అడిషనల్ పీడీ వివరణ కోరగా సదరు ఫీల్డ్ అసిస్టెంట్ నీళ్లు నమిలారు. సర్పంచ్ భర్త వైకాపా జిల్లా కార్యదర్శి ఉపాధి పనికి రాకపోయినా పనిచేస్తున్నట్లు చూపి డబ్బు డ్రా చేయడంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీడీఓ రమణ, సీఐ రామాంజులు, ఏపీడీ జుబేదా, ఎస్ఆర్పి కన్నారెడ్డి, ఎంపీటీసీ-3 చంద్ర భాస్కర్ రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## సబ్‌కలెక్టరేట్ అగ్నిప్రమాదాన్ని పరిశీలించిన

# స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సిసోడియా





**మదనపల్లె, జులై 23 ప్రభాతవార్త :**

మదనపల్లె సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదాన్ని మంగళవారం స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ సిసోడియా పరిశీలించారు. ఈ సందర్భంగా స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా మాట్లాడుతూ అగ్ని ప్రమాదానికి గల కారణాలను పూర్థిస్థాయిలో విచారణ చేపట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రమాదంపై చాలా సీరియస్‌గా ఉందని, అగ్ని ప్రమాదానికి గల కారణాలను త్వరితగతిన చేదించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆదివారం అర్థరాత్రి ఎన్నిగంటలకు ప్రమాదం సంబశించింది. ఆ సమయంలో కార్యాలయంలో ఎవరెవెరు ఉన్నారు. షార్ట్ సర్క్యూ ఎలా జరిగింది. ఇన్వైటర్లు ఎక్కడెక్కడ ఉన్నాయి. సబ్‌కలెక్టర్ చాంబర్ ఎక్కడ, వంటి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. అగ్నిప్రమాదం జరిగిన 22-ఎ విభాగానికి సంబంధించిన గదిలో కాలిపోయిన పైళ్ళను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం చుట్టుపక్కల, వెలుపలవైపు, ప్రహరీగోడను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చీఫ్ సెక్రటరీతో పాటు అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ట్రాన్స్‌కో జిఎండి చక్రదర్‌బాబు, ఎస్పి విద్యాసాగర్‌నాయుడు, మదనపల్లె, రాయచోటి ఆర్డీఓలు, తహశీల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.



## బాబు చాణక్యతకు నిదర్శనం

# కేంద్ర బడ్జెట్ కేటాయింపులు

## టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్ రాజు



రాజంపేట అర్బన్, జులై 23, ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు చాణక్యతకు నేడు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన బడ్జెట్టే నిదర్శణమని తెలుగు దేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు అన్నారు. మంగళవారం స్థానిక పార్లమెంట్ కార్యాలయంలో ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడు తూ మొట్టమొదటి సారిగా కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రంపై వరాలఝుల్లులు కురిపించిందని సంతోషం వ్యక్తం చేశారు. దీంతో ఎన్నో ఏళ్లుగా సమాధానాలు లేనిప్రశ్నగా మిగిలిని రాజధాని, పోలవరం ఆంధ్ర రాష్ట్ర ప్రజల కలలు నెరవేరబోతున్నా యన్నారు. వైసిపి ప్రభుత్వంలో అధోగతి పాలైన రాష్ట్రం చంద్రబాబు నాయుడు చాణక్యతతోగాడిన పడనున్నదని తెలిపారు. రాజధాని అమరావతికి 15వేల కోట్లు కేటాయించడమే కాక, పూర్తయ్యే వరకు సహాయసహకారాలు అందిస్తామని కేంద్రం హామీ ఇవ్వడంహర్శనీయం మని అన్నారు. దీంతో రాజధాని రైతుల కల సాకారం కానుందన్నారు. రైతుల త్యాగానికి ఫలితం దక్కనుం దన్నారు. రాష్ట్ర ప్రజల అత్యున్నత ఆకాంక్ష అయిన పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించడమే కాక రాష్ట్ర విభజన చట్టానికి అనుగుణంగా పోలవరం సత్వర నిర్మాణానికి సంపూర్ణ సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వహామీ ఇవ్వడం చంద్రబాబు సాధించిన విజయమేనని పేర్కొన్నారు. కడప జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక వాడకు మహర్ధశ పట్టనుందన్నారు. విశాఖ, చెన్నై పారిశ్రామిక

క్యారిడార్‌లోని నోడ్‌లను ప్రత్యేక సాయం, కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీరు, విద్యుత్, రహదారులు, హైవేల అభివృద్ధికి నిధులు, హైదరాబాద్, బెంగుళూరు క్యారిడార్‌లో ఓర్వకల్లుకు నిధులు, ఏపీలోని వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజి, రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజి కింద నిధులు కేటాయించడంతో పాటు ఆంధ్రప్రదేష్ విభజన చట్టంలో పేర్కొన్న మేరకు వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయించడం కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు సాధించిన మొదటి విజయమనిపేర్కొన్నారు. స్కిల్ డెవలప్మ్ఎంట్ కోసం లక్ష 50వేల కోట్లు కేటాయించడం లోకేష్ బాబు చేపట్టిన యువగళం స్ఫూర్తితోనేనని అన్నారు. రాష్ట్రానికి బాగుపడే రోజులొచ్చాయని అన్నారు. అత్యధిక మెజారిటితో కూటమిని గెలిపించుకున్న ఆంధ్ర రాష్ట్ర ప్రజల విశ్వాసం వమ్ము కాకుండా అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న చంద్రబాబుకు ఈ బడ్జెట్ కేటాయింపు ఊతమిచ్చిందని కొనిఆడారు. బాబు పాలనలో రాష్ట్రం అగ్రగామిగా నిలవడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కల్లుగీత కార్మిక రాష్ట్ర డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రమణ్యంనాయుడు, ఒంటిమిట్ట మాజీ ఎంపీపీ లక్ష్మినారాయణ నాయుడు, సిద్ధవటం మాజీ జడ్పీటీసీ చలమయ్య యాదవ్, రాజంపేట పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రమణ్యం నాయుడు, రాజంపేట మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఆర్.సతీష్ రాజు, పార్లమెంట్ తెలుగుయువత సోషల్ మీడియా కోఆర్డినేటర్ సూర్యనారాయణరాజు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సబ్‌కలెక్టరేట్‌లో కాలిన పైల్స్‌పై సిఐడి ముమ్మర దర్యాప్తు







**మదనపల్లె, జులై 23 ప్రభాతవార్త :**

మదనపల్లె సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో చోటు చేసుకొన్న అగ్ని ప్రమాదంలో కీలకమైన డాక్యుమెంట్లు, రికార్డులు, కంప్యూటర్లు దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై రెండవ రోజు మంగళవారం సిఐడి ఛీఫ్ రవిశంకర్ అయాన్నర్ ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నారు. ఈ దర్యాప్తులో సబ్‌కలెక్టరేట్‌లో గతంలో విధులు నిర్వహించిన ఆర్డీఓ ఎంఎస్.మురళి, ప్రస్తుత ఆర్డీఓగా ఉన్న హరిప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. దీంతో పాటు సబ్‌కలెక్టరేట్‌లో 22-ఏ విభాగానికి సంబంధించి విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ గౌతంతేజ్‌ను, కిందిస్థాయి సిబ్బందిని అదుపులోకి తీసుకొని వేర్వేరుగా విచారణ చేపడుతున్నారు. వీరు వినియోగిస్తున్న సెల్‌ఫోన్లు సీజ్ చేయడం జరిగింది. అదే విధంగా అగ్నిప్రమాదంలో అరకొరగా కాలిన డాక్యుమెంట్లును క్షుణ్ణంగా పరిశీలించి సీజ్ చేయడం జరిగింది. జిల్లా ఎస్పి విద్యాసాగర్‌నాయుడు, జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఏఎస్పి రాజ్‌కమల్ ఆధ్వర్యంలో పోలీసులు వివిధ బృందాలుగా ఏర్పడి అగ్ని ప్రమాదానికి బాధ్యులుగా పేర్కొంటున్నవారిని వేర్వేరు చోట్ల ముమ్మరంగా విచారణ చేపడుతున్నారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, డిఆర్ఓ సత్యనారాయణ, రాజంపేట ఆర్డీఓ మోహన్‌రావులు వేర్వేరుగా మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహశీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ అధికారులను ముమ్మరంగా విచారణ చేపడుతున్నారు. మదనపల్లె డివిజన్ పరిధిలోని 22-ఏ విభాగానికి సంబంధించిన భూములు, డికేటి భూముల వివరాలు, ఇటీవల కబ్జాలకు గురైన భూముల వివరాలు, ఎన్ఓసి ఇచ్చిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అగ్ని ప్రమాద ఘటనలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హస్తం ఉందంటూ పలు ఆరోపణలు రావడంపైన సిఐడి అధికారులు ఆ కోణంవైపు కూడా ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఆయన ప్రధాన అనుచరునిగా మదనపల్లెలో ఉంటున్న రైస్‌మిల్ మాధవరెడ్డిని కూడా అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. వారి స్వగృహంలో ఉన్న కీలక డాక్యుమెంట్లు కూడా స్వాధీనంచేసుకొంటున్నట్లు తెలిసింది. మాధవరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారన్న వార్త డివిజన్ పరిధిలో దావాలంగా వ్యాపించడంతో వైకాపా కీలక నేతల్లోనూ,రెవెన్యూ అధికారుల్లో భయాందో ళనల నెలకొంది. మదనపల్లె సబ్‌కలెక్టరేట్ అగ్నిప్రమాదంపై స్వయాన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకొని సీరియస్ కావడంపట్ల ఈ ఘటనపై నిగ్గు తేల్చేందుకు సిఐడి, పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారులు ముమ్మరంగా దర్యాప్తులు చేపడుతున్నారు. డిఎస్‌పి కార్యాలయంలో దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిసింది. కోట్లాది రుపాయల భూములకు సంబంధించి కీలకమైన డాక్యుమెంట్లు అగ్నికి ఆహుతి కావడం పట్ల ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కూడా తీవ్రంగా ఆరోపిస్తున్నారు. రెండు రోజుల్లో ఈ ప్రమాద ఘటనపై సిఐడి నిగ్గు తేల్చనున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా అగ్నిమాపక, ట్రాన్స్‌కో శాఖలకు చెందిన ఉన్నతాధికారులు కూడా ఈ అగ్ని ప్రమాదంపై రెండు రోజులుగా సబ్‌కలెక్టరేట్‌లో దర్యాప్తు చేస్తున్నారు. అన్నమ య్య, చిత్తూరు, అనంతపురం జిల్లాలకు చెందిన కీలకమైన అధికారులు అంద రూ ఈ దర్యాప్తులో నిమగ్నమై ఉన్నారు. దర్యాప్తు సమయంలో సబ్‌కలెక్టరేట్ లోకి మీడియాను అనుమతించలేదు. చిత్తూరు జిల్లాలోని పుంగనూరు తహశీల్దార్ కార్యాలయంలో కూడా డిఎస్పి విష్ణురఘువీర్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు.

# విరిగిన ధ్వజస్తంభాన్ని పట్టించుకోని ఆలయ అదికారులు



**రైల్వే కోడూరు అర్బన్,జులై23,ప్రభాతవవార్త :**

కోడూరు టౌన్‌లోని నడిబొడ్డున ఉన్న శ్రీ శ్రీ భూజంగేశ్వర స్వామి వారి ఆలయ ద్వజ స్థంభం కూలి దాదాపు 9 నెలలు గడుస్తున్నా ఆలయ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. అనునిత్యం భక్తులతో కిటకిటలాడుతూ, ఆ పరమేశ్వరుని ఆశీస్సుల కోసం ఆయన దర్శనం కోసం ప్రతిరోజూ వందల సంఖ్యలో భక్తులు సమర్పించే కానుకలు ఉండి ఆదాయంతో పాటు ఆలయానికి సంబంధించి కుడి వెలుపల ఉన్నటువంటి షాపుల గుండా దాదాపు రూ.46వేల రూపాయలు ప్రతి నెలా బాడుగలు వస్తున్నా హుండీ ఆదాయం దాదాపు 5 నుంచి 10లక్షల దాకా సంవత్సరానికి వస్తున్నా ఆలయూనికి సంబంధించిన ఇంటి స్థలాలు, ఇల్లు వాటి డెవలప్‌మెంట్ మూత్రం పట్టించుకునే దిక్కు లేదు. గుడికి సంబంధించిన గోడలు కూలిపోయి ఉన్నా పునర్మించాలని ఆలోచన లేదు.సంవత్సరానికి 10,15 లక్షలు ఆదాయం ఉన్నా భుజంగేశ్వర స్వామిని పట్టించుకునే దిక్కులేదు. ఆదాయాన్ని ఎలా భుజించాలని ఆలోచన తప్ప గుడికి సంబంధించిన ప్రహరీ, ఆలయ అభివృద్ధి, సుచి, సుబ్రత, పట్టించుకోవల్సిందిగా ప్రజలు వేడుకుంటున్నారు. ఇకనైనా భక్తుల మొర ఆలకించి ఆలయ నిర్మాణం, ధ్వజస్థంభ నిర్మాణం చేయాలని భక్తులు కోరుకుంటున్నారు.


విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

అన్నమయ్య జిల్లా విద్యాదికారి....4లో

బిటి కళాశాల టీచింగ్ స్టాఫ్‌కు మంత్రి హామీ ... 3లో


# డీకేటీ ఫ్రీహోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్‌కు ఇక చెక్ పెట్టినట్లేనా?

- ప్రభుత్వం రైతులు అమ్మిన భూములపై కాకుండా అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి
- సీఎం కూడా బాగా ఆలోచించి ఫ్రీ హోల్డ్‌పై స్పష్టత ఇవ్వాలి
- సబ్‌రిజిస్ట్రార్లకు మౌఖిక ఆదేశాలు....- అక్రమ భూకబ్జాదారుల్లో వణుకు



రాయచోటి, జులై 23, ప్రభాతవార్త: వైసీపీ ప్రభుత్వంలో ఖజానా నింపడానికి తెరిచిన కొన్ని దారులను రాష్ట్రంలో కొలువుదీరిన ఎన్డీఏ ప్రభుత్వం మూసివేస్తోంది. అలాంటిలి వాటి కోవలోకి చెందిన డీకేటీ భూముల ఫ్రీ హోల్డ్ ల్యాండ్ రిజిస్ట్రేషన్, తాజాగా శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారుల ద్వారా ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్లను తక్షణం ఆపివేయాలని మౌఖికంగా ఆదేశాలు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. వైసీపీ ప్రభుత్వంలో ఏడాదికి పైగా జరిగిన ఈ ప్రక్రియలో లక్షల ఎకరాల డీకేటీ భూములు రిజిస్ట్రేషన్‌కు నోచుకున్నాయి. వాటిలో అధిక శాతం అప్పటి అదికార పార్టీ నేతలే కొనుగోళ్ల రూపంలో సొమ్ము చేసుకున్నట్లు విమర్శలున్నాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వైసీపీ భూకబ్జాదారులపై ఆపరేషన్ ప్రారంభించిన నేపథ్యంలో అక్రమంగా భూములు సంపాదించిన వారిపై కూడా దృష్టి సారించింది. ఈ క్రమంలోనే డీకేటీ ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు ఆపివేయాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది.

డీకేటీ ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లకు బ్రేక్ పడనుందా?

తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిది కాదని రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫ్రీ హోల్డ్‌కు సంబంధించిన భూ అంశాలను 2024లో రాష్ట్రంలో కొలువు దీరిన ఎన్డీఏ ప్రభుత్వం పున: పరిశీలిస్తోంది. వాటిలో కొన్నింటిని ఇప్పటికే రద్దు చేసింది. భూముల రీసర్వేని కూడా రద్దు చేస్తూ రాష్ట్ర మంత్రి వర్గం తీర్మానించడం అదే విధంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడం జరిగింది. అదే కోవలోనే డీకేటీ భూముల ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్లకు కూడా ప్రస్తుతం బ్రేక్ వేసింది. జులై 19 నుంచి డీకేటీ భూముల ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్లను ఎటువంటి పరిస్థితుల్లో చేయొద్దంటూ రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు, జిల్లా సబ్ రిజిస్ట్రార్లకు మౌఖిక ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఇదే క్రమంలోనే డీకేటీ భూములను తక్కువకు కొని వందల ఎకరాలు పోగు చేసుకుని ఫ్రీహోల్డ్ భూములను రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి సిద్ధపడుతున్న పలువురు భూ వ్యాపారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఫ్రీ హోల్డ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని ఏడాది క్రితం వైసీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన వెబ్‌సైట్‌లో 21 ఏ ప్రొహిబిటెడ్ జాబితా నుంచి అర్హత పొందిన డీకేటీ భూముల వివరాలను తొలగించింది. ఈ అంశం ఎంత మందికి మేలు చేసిందో తెలియదు కానీ చాలా మంది అప్పఇ అధికార పార్టీ నాయకులను మాత్రం కుబేరులను చేసిందనే విమర్శలున్నాయి. ప్రభుత్వ డీకేటీ భూముల రిజిస్ట్రేషన్ లావాదేవీలకు అర్హత సంపాదించి కోట్లకు కోట్లు సంపాదించిన వారు చాలా మంది ఉన్నారు. ఏడాదికి పైగా ఈ తంతును రాష్ట్ర వ్యాప్తంగా లక్షల ఎకరాలు రిజిస్ట్రేషన్లు జరిగి క్రయ విక్రయాలు బాగా పెరిగాయి. దీనివల్ల రిజిస్ట్రేషన్ శాఖకార్యాలయాల ద్వారా ప్రభుత్వానికి కొంత ఆదాయం కూడా పెరిగింది. పట్టణ ప్రాంతాల్లోని రిజిస్ట్రేషన్ భూములను వెతికి వెతికి మరీ కొని భూ వ్యాపారాలను ముమ్మరం చేసుకున్నారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో భూ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. రైతులు అవకాశాన్ని వినియోగించుకోలేక నష్టపోయామని చెబుతున్నారు. రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఈ అంశాన్ని పున: పరిశీలించి పటిష్టంగా అమలు చేసి అర్హత పొందిన డీకేటీ భూములనడు రిజిస్ట్రేషన్ వెసులుబాటు కల్పించాలని లేనట్లయితే రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన భూములను తిరిగి రైతులకు వెనక్కి ఇచ్చినప్పుడు రియల్టరుకు డబ్బు కట్టలేని పరిస్థితి ఉందని ంరైతులు ఆత్మహత్యలు కూడా చేసుకునే పరిస్థితిలు ఉన్నాయని రైతుల వద్ద నుంచి భూములు విక్రయించిన వారు కూడా పేర్కొంటున్నారు. ఏది ఏమైనా ఎన్డీఏ ప్రభుత్వం అతి త్వరలోనే ఫ్రీ హోల్డ్ సంబంధించిన రిజిస్ట్రేషన్లు వెంటనే యథావిధిగా కొనసాగించాలని లేనట్లయితే ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చే సూచనలు ఉన్నాయని పలువురు చర్చించుకుంటున్నారు.

### ఫ్రీ హోల్డ్ ఎట్టి పరిస్థితుల్లోనూ రిజిస్టర్ చేసేది లేదు



ఫ్రీ హోల్డ్ భూములు రిజిస్టర్ చేయరాదని ప్రభుత్వం నుంచి హోల్డ్ చేయమని ఆదేశాలు వచ్చాయి. తిరిగి పై నుంచి ఆదేశాలు వచ్చే వరకు ఫ్రీ హోల్డ్ ఎట్టి పరిస్థితుల్లో రిజిస్టర్ చేయడం కుదరదు. అదే విధంగా ఫ్రీ హోల్డ్ భూములు రిజిస్టర్ అయిన వాటికి కూడా ప్లాట్లు ఉన్నట్లయితే వాటిని కూడా రిజిస్టర్ చేయడం కదరదు.

– గురుస్వామి, రాయచోటి జిల్లా సబ్ రిజిస్ట్రార్.

## ఆషాఢ మాసంలో ఆంజనేయ స్వామికి విశేష పూజలు

బద్వేలు అర్బన్, జూలై 23 ప్రభాతవార్త :
శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి , అభయాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ఆలయ పూజారి వీరేశాచార్యులు ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, సింధూర అర్చన పలు రకాల పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అభిషేక దాతలుగా మదనకంటి మల్లికార్జున సతీమణి అపర్ణ, రేచర్ల పెంచలమ్మ ఈమె కుమారుడు శ్రీనివాసులు,,బైసాని శివశంకర్‌రెడ్డి సతీమణి సురేఖ, ఇనకాల కుప్పం సుధాకర్ సతీమణి దాక్షాయణి కుటుంబ సభ్యులు పాల్గొని పూజలు నిర్వహించారు.

## వేతన జీవులను నిరాశ పరిచిన కేంద్ర బడ్జెట్

బద్వేలు అర్బన్, జూలై 23 ప్రభాతవార్త :
పాత పన్నుల విధానంలో ఎలాంటి మార్పు చేయకుండా కొత్త పన్నుల విధానంలో మాత్రమే మార్పులు చేయడం వల్ల వేతన జీవులకు ఎలాంటి ఊరట కలగలేదని యూటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధన విజయ "కుమార్ విమర్శించారు. మంగళవారం స్తానిక ఎన్‌జీవో హోం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానంలో మార్పులు తెస్తామని చెబుతూ నే పాత పెన్షన్‌పై బడ్జెట్‌లో లేకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులను నిరాశ కలిగించిందన్నారు. ఉద్యోగుల ఇన్‌కంటాక్స్‌కు సంబంధించి పాత విధానం కంటే కొత్త విధానంలో పన్ను ఎక్కువగా చెలి ంచాల్సి రావడంతో ఉద్యోగులు పాత విధానానికి మొగ్గు చూపుతున్నారన్నారు. విద్యారంగానికి బడ్జెలో 6 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా ప్రస్తుత బడ్జెట్‌లో 3.25 శాతం నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యారంగాని ప్రాధాన్యత లేనట్లు ప్రభుత్వం వ్యవహరించడం తగదన్నారు. పాత పన్నుల విధానంలో 7 లక్షల వరకు ఎలాంటి పన్నులు లేకుండా మినహాయింపు ఇచ్చేవిధంగా పన్నుల స్లాబ్ విధనాన్ని సవరించాలని కనీసం లక్ష రూపాయల వరకైనా స్టాండర్డ్ డిటెక్షన్‌గా మినహాయింపులు ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బద్వేలు మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్, ట్రెజరర్ గుర్రయ్య, గోపవరం మండల అధ్యక్షులు వీరదాసరి క్రిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

## రేపటినుంచి ఉరుసు ఉత్సవాలు ప్రారంభం

బద్వేలు అర్బన్, జూలై 23 ప్రభాతవార్త :
పట్టణంలోని దర్గావీధిలో వెలసివున్న హజరతహుస్సేన్‌పీర్ అవులియా వారి ఉరుసు ఉత్సవాలను సయ్యద్ మహమ్మద్ కరిముల్లా, హుస్సేన్ షా కదిరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అన్వర్ బాష , సిమెంటు షరీఫ్ తెలిపారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాల నిర్వహణకు ఇప్పటికే దర్గా పరిసర ప్రాంతాలలో సుందరీకటన ఏర్పాట్లతో పాటు విద్యుత్ డెకరేషన్ పలు కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయి. ప్రముఖమైన ఈ ఉరుసు ఉత్సవాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచేకాక , ఇతర జిల్లాల నుంచి సైతం స్వామివారి భక్తులు పెద్ద ఎత్తున తరలి రానున్నారు. ఉరుసు ఉత్సవాలలో భాగంగా 24న స్వామివారికి గంధ మహోత్సవం,25వ రాత్రి ఉరుసు మహోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## కేంద్ర బడ్జెట్‌లో కడప ఉక్కు పరిశ్రమపై నీళ్లు

– ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి

కడప వైద్యవిభాగం, జులై 23, ప్రభాతవార్త:
రాష్ట్ర విభజన చట్టంలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను పూర్తి చేస్తామన్న కేంద్ర ప్రభుత్వం ఏటేటా బడ్జెట్‌లో కడప ఉక్కు పరిశ్రమపై నీళ్లు చల్లుతూనే ఉన్నారని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. యువతకు ఉద్యోగ అవకాశాలు లేక ఎదురు చూస్తున్న వారికి నిరాశే మిగిలిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## రికార్డులు దగ్ధంపై న్యాయ విచారణ చేయాలి

కడప వైద్యవిభాగం, జులై 23, ప్రభాతవార్త:
మదనపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదంపై న్యాయ విచారణ జరిపించాలని అందులో ఎవరైనా దోషులు ఉన్నారని తేలితే వారిని కఠినంగా శిక్షించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (ఆర్‌సీపీ) చింతకొమ్మదిన్నె మండల కార్యదర్శి మడగలం ప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళి

కడప వైద్యవిభాగం, జులై 23, ప్రభాతవార్త:
కడప నగరం హబీబుల్లావీధిలో ఉన్న నందమూరి బాలకృష్ణ, జూ॥ఎన్టీఆర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లా బకాష్ కార్యాలయంలో విప్లవకారుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి కార్యక్రమాన్ని నిర్వమించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన గొప్పదనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో అమురుజ్, షేక్ యూసుఫ్, అమరేంద్రనాథ్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఐ చాన్‌బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

## తలనీలాల వేలం పాట

పెండ్లిమర్రి, జులై 23, ప్రభాతవార్త:
పెండ్లిమర్రి మండలంలోని నందిమండలం గ్రామ సమీపంలో కొండపై వెలసిన శ్రీ కొండ గంగమ్మ దేవస్థానానికి సంబంధించిన బక్తాదుల ద్వారా వచ్చు తలనీలాలు వసూలు చేసుకొని అమ్మకొను హక్కుకు గాను ఈనెల 31 ఉదయం 11.30 గంటలకు దేవస్థానం వద్ద వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈవో మారుతీ ప్రసాద్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా తలనీలాల సేకరణ డిపాజిట్టు రూ.30వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని వారు కోరారు.

## తంబళ్లపల్లెలో పారిశుద్ధ్య పక్షోత్సవాలు విజయవంతం

– ఈవోఆర్డీ దిలీప్‌కుమార్ నాయక్

తంబళ్లపల్లె, జులై 23, ప్రభాతవార్త:
జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తంబళ్లపల్లె మండలంలో మంగళవారం పారిశుద్ధ్య పక్షోత్సవాలు విజయవంతంగా ప్రారంభమైనట్లు ఈవోఆర్డీ దిలీప్‌కుమార్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఈనెల 22 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేస్తున్నట్లు చెప్పారు. మురికి నీటి కాలువలు శుభ్రం చేయడం, తాగునీటి ట్యాంకులు క్లీనింగ్ చేసి బ్లీచింగ్ కలుపుట, పైప్‌లైన్ల లీకేజీ రిపేరు చేయుట, చెత్త దిబ్బలు, పిచ్చి మొక్కలు తొలగింపు తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు పరిశుభ్ర కార్యక్రమాలు చేపట్టి డయేరియా, మలేరియా ఇతర అంటువ్యాధులు శోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాగునీరు కాచి చల్లార్చి తాగాలని, దోమ తెరలు వాడాలని, ఇళ్ల పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అవగాహన చేపట్టినట్లు చెప్పారు. ఆయన వెంట కార్యదర్శి రాజశేఖర్ నాయక్, సచివాలయ, పారిశుద్ధ్యం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## 29న రామాపురం మండల మీట్

రామాపురం, జులై 23, ప్రభాతవార్త:
ఈనెల 29న సోమవారం జరగనున్న మండల సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షురాలు గడికోట విజయలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రవాణా మరియు క్రీడాశాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరవుతారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో మండలంలోని పలు సమస్యలపై సమావేశం ఉంటుందన్నారు. అన్ని శాఖల మండల అధికారులు, గ్రామ స్థాయి అధికారులు ఆయా శాఖల వారీగా నివేదికలను తీసుకురావాలని ఆయన కోరారు.

## ఉద్యోగులను నిరుత్సాహపరచిన బడ్జెట్

ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి

ప్రొద్దుటూరు అర్బన్, జూలై 23, ప్రభాతవార్త:
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తమకు మేలు చేకూరుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్న ఉద్యోగులకు బడ్జెట్ తీవ్రంగా నిరుత్సాహపరిచిందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పన్ను విధానంతో స్లాబు రేట్లు మార్చకపోవడం ఉద్యోగుల పాలిట తీవ్ర శాపంగా మారిందన్నారు. నిత్యావసర ధరలు రోజురోజుకి పెరుగుతున్న తరుణంలో ఉద్యోగుల సంపాదన కుటుంబం గడపడానికే సరిపోతుందని, మళ్లీ దీనిపై ఆదాయపు పన్ను చెల్లించాలంటే తలకు మించిన భారంగా ఉంటోందన్నారు. గత కొన్నేళ్లుగా రాష్ట్ర ఉద్యోగులు పీఆర్సీ ఫిట్మెంట్లు, డిఏ బకాయిల రూపంలో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని, కనీసం కేంద్ర బడ్జెట్‌లో అయిన పన్ను విధానంలో కొంతైనా ఊరట లభిస్తుందనుకుంటే స్లాబ్ రేట్లు మారకపోవడం బాధాకరంగా ఉందన్నారు. ప్రభుత్వంలో అంతర్భాగమైన ఉద్యోగులకే ప్రభుత్వాలు లబ్ది చేకూర్చకపోతే వారి గోడు ఎవరికి చెప్పుకోవాలని ఆయన ప్రశ్నించారు.

## తువ్వపల్లి చెరువుకు జొన్నపు చెరువు నుంచి వాటర్ పంపింగ్ పరిశీలన

టీడీపీ రాష్ట్ర నాయకులు మాచుపల్లి రామచంద్ర నాయుడు

మైదుకూరు రూరల్,జులై 23,ప్రభాతవార్త:
మైదుకూరు ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ గారి సూచన మేరకు తువ్వపల్లి చెరువు కు జొన్నపె చెరువు నుంచి వాటర్ పంపింగ్ మరియు కాలువల గురించి అండ్ జాండ్లవరం పైన వున్న రెండు కొండల మధ్య నూతన చెరువు నిర్మాణం గురించి తెలుగుగంగ ఇంజనీర్స్‌తో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర నాయకులు మాచుపల్లి రామచంద్ర నాయుడు,మండల ప్రెసిడెంట్ బిమయ్య,జిల్లా బీసీ సెల్ నాయకులు కిషోర్ యాదవ్,తెలుగు యువత ప్రెసిడెంట్ మాచుపల్లి రమేష్ నాయుడు,నాగేశ్వర్ రెడ్డి,టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## తాళ్లపాకలో వైభవంగా రధోత్సవం

రాజంపేట అర్బన్, జూలై 23, ప్రభాతవార్త:
అన్నమాచార్యుల జన్మస్థలమైన తాళ్లపాకలో జరుగుతున్న సిద్ధేశ్వర స్వామి, చెన్నకేశం స్వామి వార్ల వార్శిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి రధోత్సవం వైభవంగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఎంతో శాభాయమానంగా అలంకరించిన రథంపై ఊరేగుతూ తాళ్లపాక మాడవీధుల్లో భక్తులకు ధర్శణమిచ్చారు. గోవింద నామస్మరణలు, భజన బృందాల కోలాటాల నడుమ అద్యంతము కనుల పండుగ సాగిన ఈ కార్యక్రమాలను భక్తులు ఆనందోత్సవాలతో తిలకరించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాక దేవాలయాల సమూహ ఇన్స్‌పెక్టర్ బాలాజి, గురుస్వామి యాదవ్, వినోద్‌కుమార్, సర్పంచ్ గౌరిశంకర్, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ప్రోగ్రామ్ అసిస్టెంట్ గోపి బాబు, ఆర్‌స్వామినాయక్, దేవరాజులు, ధర్మచార్యులు, గంగనపల్లి వెంకటరమణ, భక్తులు పాల్గొన్నారు.

## గోమాతకు శస్త్ర చికిత్స,

మైదుకూరు జులై 24, ప్రభాతవార్త :
మైదుకూరు టౌన్ బద్వేల్ రోడ్డు మార్కెట్ కూడలిలో మంగళవారం లేగదూడ పైకి లారీ ఎక్కడంతో లేగదూడ రెండు గెట్టేలు విరిగి నడువలేని స్థితిలో ఉండటం గమనించిన స్థానికులు పోలీసులకు మరియు వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వగా వెంటనే అక్కడికి వాహనమిత్ర వాహనంతో వైద్య సిబ్బంది,ఎస్సై.ఘణ మధులేటి చేరుకున్నారు.తర్వాత అక్కడ ఉన్న ప్రజల సహకారంతో రిస్కుచేసి లేగదూడను వాహనమిత్ర వాహనంలోకి ఎక్కించి వైద్యం అందించారు.సకాలంలో స్పందించిన ఎస్సై మదులేటికి,వాహనమిత్ర వైద్య సిబ్బందికి ప్రజలు అభినందనలు తెలిపారు.

## కేంద్ర బడ్జెట్ లో ఏపీకి శూన్యం

రైల్వేకోడూరు,జులై 23,ప్రభాతవార్త:
కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ కు ఎటువంటి లాభదాయక బడ్జెట్ శూన్యమని అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు బోయిన శ్రీకాంత్ అన్నారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో మన రాష్ట్రానికి ఉపగయోపడే నిధుల కానీ పవిశ్రమలు కానీ పొందపరచలేదని రాష్ట్ర ప్రజలను తీవ్ర అన్యాయానికి గురి చేశారని ఆరోపించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంజీవిని లాంటి ప్రత్యేక హోదాను విభజన హామీలను నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు,పక్క రాష్ట్రమైన భీహార్ ప్రభుత్వం కేవలం 8 మంది ఎంపీలు ఉండి కూడా కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి 20000 కోట్ల రూపాయల ప్యాకేజీ 26 వేల కోట్ల రోడ్ల కనెక్టివిటీ కొత్త పరిశ్రమలు కొత్త మెటికల్ కాలేజీలు సాధిస్తే మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎటువంటి లాభ దాయకంగా బడ్జెట్లో కేటాయింపులు లేవని శ్రీకాంత్ విమర్శించారు.

## ప్రజల ఆదరణ మరువరానిది : ముక్క వరలక్ష్మి



రైల్వేకోడూరు,జులై 23,ప్రభాతవార్త:
రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజల ఆదర అభిమానులు మరువరానివని రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్క రూపానంద రెడ్డి సతీమణి ముక్క వరలక్ష్మి అన్నారు.మంగళవారం రైల్వేకోడూరు పట్టణంలోని పలు ప్రైవేట్ ప్రారంభోత్సవ కార్యక్రమాలలో పాల్గొని,అనంతరం రాఘవరాజుపురం టిడిపి కార్యలయంలో విలేకరులతో మాట్లాడారు.ఈ సందర్భంగా రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని రానున్న రోజుల్లో అన్ని రంగాలలో మందుకు తీసుకెళ్తామని ఎన్నికలలో తాము ఇచ్చిన హామీలను తప్పక నెరవేర్చి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని అన్నారు.ముఖ్యంగా రైల్వేకోడూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు,వెంకటగిరి రోడ్డు పలు అభివృద్ధి ప్రణాళికలను ఏరాప్టఉ చేపి అనుమతులు రాగానే పూర్తిస్థాయిలో అభివృద్ధి పరుస్తామని అన్నారు.ఐదు మండలాల్లో ఉన్న పెండింగ్ పనులను గుర్తించి వాటిని పూర్తి స్థాయిలో పూర్తి చేసేందుకు శ్రీకారం చుట్టామని నియోజకవర్గంలోని దళిత బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతామని అన్నారు.ఇప్పటికే రైల్వేకోడూరు నియోజకవర్గంలోని దళిత బడుగు బలహీన వర్గాల మైనార్టీలు తన కుటుంబంపై చూపిస్తున్న అభిమానం ఎన్నటికీ మరవలేనిదని నిరంతరం వారి సేవలో తరిస్తామని మ్కు వరలక్ష్మి అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత నాయకులు సాయి వికాస్ రెడ్డి,గుండయ్య నాయుడు,పోలినేని చంగల్ నాయుడు,పోతురు సుబ్రహ్మణ్యం,పోతురు కిషోర్,మల్లికార్జున రెడ్డి,వేణుగోపాల్ రెడ్డి,కట్ట ఉమాదేవి,తిమ్మశెట్టి మని,సాలవు రమణరాజు పాల్గొన్నారు.

## రక్తదాన శిభిరానికి విశేష స్పందన

మైదుకూరు జులై 23, ప్రభాతవార్త :
మైదుకూరు మేధా డిగ్రీ కళాశాల యందు శుక్రవారం స్వచ్ఛందసేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిభిరానికి విశేష స్పందన లభించిందని స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహకులు వాగ్దాడం శివశంకర్ తెలియజేశారు.భారత ప్రభుత్వం నెహ్రూకేంద్రం కడప శాఖ మరియు జిల్లా స్వచ్ఛ-ంద సంస్థల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న రక్తదాన వారోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక మేధా డిగ్రీ కళాశాలలో రక్తదాన శిభిరం నిర్మహించారు.ఈ శిభిరానికి మైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం మేడికల్ సూపర్నెండెంట్ డాక్టర్ కరీముల్లా ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి రక్తదానశిభిరాన్ని ప్రారంభించారు.ఈ సంధర్భంగా రక్తదానం చేస్తున్న యువతి,యువకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రక్తదానం పై అపోహలు వీడి ఆరోగ్యవంతమైన 18 సంవత్సరములు నిండిన ప్రతి ఒక్కరురక్తదానం చేయడానికి అర్హులని,కాబట్టి యువతి,యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి రక్త కొరత లేని జిల్లాగా చేయాలని కొరారు.ప్రొద్దుటూరు బ్లడ్ బ్యాంక్ మేడికల్ ఆఫీసర్ డాక్టర్ దిలీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రక్తాన్ని సృషించలేమని ఈ రక్త కొరతను నివారించాలంటే యువత ఒక సామాజిక బాధ్యతగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.రక్తదాతలను ప్రభుత్వం గుర్తించి సర్టిఫికెట్ మరియు మొక్కను అందజేయడం జరుగుతుందన్నారు.ఈ శిభిరం నుండి దాతలు ప్రొద్దుటూరు బ్లడ్ బ్యాంకు సిబ్బందికి 43 యూనిట్ల రక్తాన్ని సేకరించి పంపారు.ఈ రక్తదాన శిభిరంలో శ్రీలక్ష్మీ నరసింహ చిట్ ఫండ్ అధినేత మాచనూరు సుబ్బరాయుడు,కళాశాల ప్రన్సిపల్ శెట్టి శ్రీనివాసులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వాగ్ధాడం శివశంకర్,కిన్నెర,ప్రసన్నకుమార్,కానాల ఈశ్వరయ్య, ఈమ్మడి శెట్టి సతీష్ బాబు,దేవిశెట్టి సుబ్రమణ్యం,యడవల్లి హరేరామ్,మైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రసాద్,సుబ్రమణ్యం,ఆనంద్‌రెడ్డి,కమాల్ భాషా పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోతే చర్యలు తప్పవు

నందలూరు,జులై 23,ప్రభాతవార్త:
నందలూరు మండల పరిధిలోని బస్టాండ్ కూడలిలో మంగళవారం నందలూరు ఎస్సై అబ్దుల్ జహీర్ వాహనాల తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలను ఇవ్వరాదని ఆయన అన్నారు.హెల్మెట్,పత్రాలు తప్పకుండా వాహనదారులు తమతో ఉంచుకోవాలని ఆయన అన్నారు.మైనర్ లు వాహనాలను తీసుకొని రోడ్ల పై వస్తే భారీ జరిమానాలు విదించడం జరుగుతుందని తెలిపారు.కనుక మండల ప్రజలు తప్పక ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీస్ సిబ్బందికి సహకరించాలని ఆయన అందరిని కోరారు.

## ఎలక్షన్లలో విధులు నిర్వహించిన ఉద్యోగుల బత్యాలు త్వరగా ఇవ్వాలి

ప్రొద్దుటూరు అర్బన్, జూలై 23, ప్రభాతవార్త:
ఇటివల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో విధులు నిర్వహించిన సచివాలయ ఉద్యోగుల బత్యాలు త్వరగా ఇవ్వాలని ఏపీ నాన్ గెజిటెడ్ మరియు గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కేజే రఘురామిరెడ్డి, సెక్రటరీ రామసుబ్బయ్య, ఎలక్షన్ డిప్యూటి తహసీల్దార్ అజయ్‌బాబును స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కోరారు. ఈ సంధర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులకు రావలసిన డబ్బులు ఎందుకు ఇవ్వడం లేదని గత 3నెలల నుండి వారు ఎలక్షన్స్ విధులలో నిమగ్నమై పనిచేయడం జరిగిందని అందుకుగాను వారికి రావలసిన పారితోషకం, బత్యాలు వెంటనే ఇవ్వాలని కోరారు. దానికి ఎలక్షన్ డిప్యూటి తహసీల్దార్ వివరణ ఇస్తూ ఎలక్షన్ నిర్వహించడం కోసం అలాట్ చేసిన మొత్తం కంటే ఎక్కువ ఖర్చు కావడం వలన వారికి ఇవ్వవలసిన మొత్తంలో కొంత భాగం ఇవ్వడం జరిగిందని మిగతా మొత్తం కోసం జిల్లా కలెక్టర్‌కి అడిషనల్ ఫండ్ కోసం 89లక్షలు ప్రపోసల్స్ పంపడం అయినదని కావున ఆ ఫండ్ రాగానే మొదట బీఎల్‌ఓగా చేసిన వారికి, వీఆర్వోలకు ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు. వీలు అయినంత తొందరగా వచ్చే దానికి కృషి చేస్తామని, ఖచ్చితంగా తెలుపగా దానికి అధ్యక్షులు రఘురామి రెడ్డి సంతృప్తిని వ్యక్తపరుస్తూ త్వరగా డబ్బులు వచ్చేదానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జె.రామసుబ్బయ్య, వైస్ ప్రెసిడెంట్ శివరామానుజ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభంజనరెడ్డి, జాయింట్ సెక్రటరీ నాగార్జున, ఈసి మెంబర్ ప్రభాకర్, మాజీ సెక్రటరీ వెంకటేశ్వర్లు మరియు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## కడపలో గంజాయిపై మెరుపు దాడులు నిర్వహించాలి

– టీడీపీ పార్లమెంటు అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప వైద్యవిభాగం, జులై 23, ప్రభాతవార్త: కడపలో విపరీతంగా ఉన్న గంజాయిపై మెరుపు దాడులు చేయాలని కడప జిల్లా ఎస్పీని టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వైసీపీ ముఖ్య నాయకుల అండదండలతో గంజాయి విపరీతంగా పెరిగిందని ఎంతటి వారైనా చట్టపరంగా కఠినంగా చర్యలు తీసుకొని సమాజాన్ని కాపాడాలని ఎస్పీని కోరారు. తెదేపా ప్రభుత్వం యువత భవిష్యత్తు కోసం, గంజాయి నిర్మూలన కోసం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

## జనసేన పార్టీ నాయకుడు మాదాసు మురళీ

ప్రొద్దుటూరు అర్బన్, జూలై 23, ప్రభాతవార్త:
కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ పేద మధ్య తరగతి కుటుంబాలకు భరోసా కల్పించేలా ఉందని జనసేన పార్టీ నాయకుడు మాదాసు మురళీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి దాదాపు 15వేల కోట్లు ప్రత్యేక సహాయం, పోలవరంకు కావలసిన నిధులు, వెనుకబడిపోయిన ప్రాంతాలైనటువంటి రాయలసీమ ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు, కొప్పర్తి ఓర్వకల్లు పరిశ్రమ కేంద్రాలకు నీళ్లు, విద్యుత్ మరియు రోడ్ల అభివృద్ధికి నిధులు విశాఖ-చెన్నై కారిడార్‌లో కొప్పర్తికి, వంటి ప్రత్యేక నిధులను కేటాయించారని ఆంధ్రప్రదేష్ రాష్ట్ర అభివృద్ధి కొరకు గతంలో ఎన్నడూ లేని విధంగా నిధులు కేటాయించినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కృష్ణయ్య యాదవ్, భాస్కర్‌రెడ్డి, ప్రతాప్, లక్ష్మినారాయణ, కమాల్‌బాష పాల్గొన్నారు.

## ఆహారం కావాలంటే సైనికుల లైంగిక వాంఛలు తీర్చాల్సిందే

### ఇదీ సూడాన్‌లో కొందరు మహిళల దుస్థితి!



**ఖర్టూమ్,** : అక్కడ పట్టెడన్నం తినాలన్నా మహిళలు భయానక అనుభవం చవిచూడాల్సిన పరిస్థితి. సైనికుల లైంగిక వాంఛలు తీరిస్తేనే వారికి ఆహారం లభిస్తుంది. ఆఫ్రికా దేశమైన సూడాన్‌లోని ఒమ్దుర్‌మన్ పట్టణంలోని కొందరు మహిళల దుస్థితిఇది. ది గార్డియన్ పత్రిక దీనిపై కథనం ప్రచురించింది. ఈ పట్టణంలో జరుగుతున్న అంతర్యుద్ధం వల్ల చాలామంది పారి పోగా దాదాపు 24 మంది మహిళలు వారి కుటుంబాలతో సహా చిక్కుకుపోయారు. ఇక్కడ ఆహారం కేవలం సైన్యం వద్ద మాత్రమే లభిస్తోంది.
ఇక్కడ ఫ్యాక్టరీల్లోనే వారు అత్యధిక ఆహార నిల్వలు ఏర్పాటు చేశారు. ఇంట్లోని వృద్ధ తల్లిదండ్రులు, పిల్లలకు ఆహారం తీసుకొనేందుకు వచ్చిన మహిళలతో సైనికులు లైంగిక వాంఛలు తీర్చుకొంటున్నారు. ఈ విషయాన్ని బాధిత మహిళలే స్వయంగా మీడియాకు వెల్లడించారు. గతేడాది ఏప్రిల్ నెలలో అంతర్యుద్ధం మొదలైన తొలినాళ్ల నుంచే ఈ పరిస్థితి నెలకొంది. అప్పట్లో సైన్యం, ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ మధ్య ఘర్షణ ఈ సివిల్ వార్‌కు దారితీసింది. రెండు వర్గాలు తమను లైంగికంగా వేధిస్తున్నట్లు మహిళలు గగ్గోలు పెడుతున్నారు. అంతే కాదు ఖాళీ ఇళ్లలో మిగిలిపోయిన వస్తువులను తీసుకోవాలన్నా మహిళలు సైనికుల కోర్కెలు తీర్చాల్సిందే. 'ఇటువంటి పరిస్థితి పగవాళ్లకు కూడా వద్దు. కేవలం నా బిడ్డల ఆకలి తీర్చడానికే నేను వారు చెప్పినట్లు చేయాల్సి వచ్చింది' అని ఓ మహిళ ది గార్డియన్ పత్రిక వద్ద వాపోయింది. కొందరు సైనికులు పాడుబడిన ఇళ్ల వద్దకు మహిళలను తీసుకొచ్చి వరుసగా నుంచోపెట్టి నచ్చిన వారిని ఎంచుకొంటున్న దృశ్యాలను చాలా చూశామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 21 యేళ్ల ఓ మహిళ సైనికులు చెప్పినట్లు చేయ దానికి అంగీకరించకపోవడంతో ఆమె కాళ్లకు నిప్పు పెట్టారని స్థానికులు వివరించారు.

## ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనడంపై నిషేధం ఎత్తివేత



**న్యూఢిల్లీ,** : రాష్ట్రీయ స్వయంసేవక్‌సంఘ్ కార్యకలాపాల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనడంపై ఉన్న నిషేధాన్ని కేంద్రం ఎత్తివేసింది. ఈనిర్ణయాన్ని ఆర్‌ఎస్‌ఎస్ శ్లాఘించింది. దీనివల్ల దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత పటిష్ఠం అవుతుందని స్పష్టంచేసింది. అంతకు ముందున్న ప్రభుత్వాలు తమ సొంత రాజకీయ ప్రయోజనాలకోసం ఆర్‌ఎస్‌ఎస్‌లో ప్రభుత్వ ఉద్యోగులు చేరడంపై నిషేధం ప్రకటించాయని ఆరోపించింది. ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరడంకానీ, సంస్థ కార్యకలాపాల్లో పాల్గొనడంపైకానీ గతంలో అనేక కారణాలతో నిషేధం, ఆంక్షలు విదించారు. ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడిన వెంటనే అనేక మంది ప్రతిపక్ష నాయకుడు ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకించారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి సునీల్ అంబేకార్ మాట్లాడుతూ ప్రస్తుత కేంద్రప్రభుత్వ నిర్ణయం సరైనదేనని ప్రజాస్వామ్య వ్యవస్థను భారత్‌లో మరింత బలోపేతం చేస్తుందని ప్రకటిం చారు. గడచిన 99 ఏళ్లుగా ఆర్‌ఎస్‌ఎస్ జాతినిర్మాణంలోను, దేశానికి సేవలందించడంలో విశేషంగా పాల్గొన్నదని అన్నారు. దేశభద్రత, సమైక్యత, సమగ్రతలకోసం ఆర్‌ఎస్‌ఎస్ సమాజంలో భాగస్వామి అవుతున్నదని, ప్రకృతి వైపరీత్యాలు, దేశంలో ఉన్న విభిన్న నాయకత్వాలతో కలిసి పనిచేసిందని ఆనాడు కూడా సంఘ్ పాత్రను ప్రశంసించిన సందర్భాలను ఆయన ప్రస్తావించారు. తన రాజకీయ ప్రయోజనాలకోసం ఆనాటి ప్రభుత్వం నిరాధారంగా ఆర్‌ఎస్‌ఎస్‌పై ఆంక్షలుప్రకటించిందని, ప్రభుత్వ ఉద్యోగులు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాల్లో పాల్గొనకూడదని నిషేధం ప్రకటించిందని సునీల్ అంబేకార్ అన్నారు. అయితే నిర్మాణాత్మక సంస్థగా ఆర్‌ఎస్‌ఎస్ ఎప్పటికీ కొనసాగుతుందని ఆయన చెప్పారు.

# బిటి కళాశాల టీచింగ్ స్టాఫ్‌కు మంత్రి హామీ

### బివైఎస్ అధ్యక్షులు పునీత్

**మదనపల్లె, జులై 23 ప్రభాతవార్త :**



బిటి కళాశాల అర్హులైన ఆరుమంది నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు న్యాయం చేసేందు కు ఐటి, విద్యాశాఖామంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు బివైఎస్ అధ్యక్షులు పునీత్ తెలిపారు. నాన్‌టీచింగ్ స్టాఫ్‌తో కలసి మంగళవారం మంత్రితో పాటు ఉన్నత విద్యాశాఖ అధికారి సౌరబ్ కౌర్‌ను కలసి విన్నవించడం జరిగింద న్నారు. ఈసందర్భంగా పునీత్ మాట్లా డుతూ గతంలో బిటి కళాశాలను ప్రభుత్వ పరం చేస్తున్నట్లు జీఓ విడుదల అయినపుడు అప్పుటి కరస్పాండెంట్ నాన్‌టీచింగ్ స్టాఫ్‌పై కక్షకట్టి వారికి అన్యాయం చేశారన్నారు. అప్పటి నుంచి వీరు చాలా నష్టపోయారన్నారు. వారు అర్హులుగా ఉండి అన్యాయానికి గురికావడం పట్ల మంత్రి, ఉన్నత విద్యాశాఖా అధికారుల దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందన్నారు. మంత్రి స్పందించి ఉన్నతాధికారుల ద్వారా విచారణ చేపట్టి త్వరలోనే అనర్హులైన వారిని ప్రోసిడింగ్‌లో తొలగిస్తూ అర్హులైన వారికి ప్రోసిడింగ్‌లో చేర్చుతూ న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం హోంమినిస్టర్ అనితను కలసి మదనపల్లెలో చోటు చేసుకొన్న అగ్నిప్రమాద ఘటనను వివరించినట్లు తెలిపారు.

# ఫైల్స్ దగ్ధంలో నిందితులను వదలొద్దు

### సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

**మదనపల్లె, జులై 23 ప్రభాతవార్త :**




సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో రెండు రోజుల క్రితం చోటు చేసుకొన్న అగ్ని ప్రమాదానికి కారకులైన నిందితులను వదలొద్దంటూ సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళ వారం సిపిఎం ఆధ్వర్యంలో కదిరిరోడ్డు లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌కలెక్టరే ట్ అగ్ని ప్రమాదంలో కీలకమైన 22-ఏ విభాగం, తపాల విభాగం, ఏఓ కార్యాలయ విభాగాల్లో కాలి బూడిద అయిన ఫైల్స్ గురించి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. 22-ఏ విభాగం అధికారిగా ఉన్న గౌతంతేజ్‌పై చర్యలు తీసుకో వాలన్నారు. ఉన్నతాధికారులు ఘటనా స్థలంలో విచారణ చేపట్టినా ఇంతవరకు నిగ్గుతేల్చకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అధికార పార్టీ నేతల మాటలకు అధికారులు తల వంచద్దొంటూ చెప్పారు. ఫైల్స్ కాలిన కుట్రలో టిడిపి, వైసిపి నాయకులు ఇద్దరూ కుట్ర ఉండే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిశర్మ, నాగరాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

# నేటినుంచి హార్సిలీహిల్స్‌లో ఏఐటియుసి వర్క్‌షాపు

**మదనపల్లె, జులై 23 ప్రభాతవార్త :**



ప్రముఖ వేసవి విడిది అయిన హార్సిలీహిల్స్‌లో బుధ, గురువారాల్లో రెండు రోజులు పాటు రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటియుసి) అను బంధం రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు జరుగు తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బ రాయుడు తెలిపారు. మంగళవారం సం తగేటు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడతూ గత సమ్మెకాలం సందర్భంగా రూ.1000 కానుక, 15రోజులు సమ్మెకాలం జీతం, సమానంగా వేతనం చెల్లించాలని కోరారు. పార్కులో పనిచేసే కార్మికులకు జీఓనెంబర్ 32 ప్రకారం జీతాలు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మున్సిపల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్, నాగరాజు, వృద్విరాజ్, నరసింహులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్య చేసుకొన్న రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

**మదనపల్లెక్రైం, జులై 23 ప్రభాతవార్త :**



అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకొన్న రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు కోరారు. ములకలచెరువు మండలం, గూడుపల్లె పంచాయితీ, కొనుగొండవారిపల్లెకి చెందిన చంద్రవేఖర్‌రెడ్డి అప్పుబాధతో ఆత్మహత్యయ త్నంకు పాల్పడి జిల్లా ఆసుపత్రిలో చికిత్స లు పొందుతూ మరణించాడు. మంగళవారం జిల్లా ఆసుపత్రిలో రైతు కుటుంబసభ్యులను సిపిఎం జిల్లా కార్యదర్శి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నష్టాలు రావడంతనో అప్పు లు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడడం దురదృష్టకరమన్నారు. రైతుల సమస్యలకు పరిష్కారం అత్మహత్య కాదని, పోరాటమే పరిష్కారమన్నారు. ప్రభుత్వాలు రైతులను విస్మరించడం వల్లనే ఆత్మహత్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి ఆత్మహత్య చేసుకొన్న రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని తెలిపారు.

# ఉద్యోగస్తులను నిరాశపరచిన కేంద్ర బడ్జెట్

**మదనపల్లెక్రైం, జులై 23 ప్రభాతవార్త :**

ఉద్యోగస్తులను, ఉపాధ్యాయులను కేంద్ర బడ్జెట్ నిరాశపరిచిందని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మదుసూదన తెలిపారు. గత పదేళ్ళుగా ఆదాయపు పన్ను మినహాయించు రనూ.2.5లక్షలకే పరిమితమైందని తెలిపారు. రూ.8లక్షల లోపు ఆదాయం కలిగిన వారిని ఆర్థికంగా వెనుకబడిన వారిగానే లెక్కస్తూ మరోకవైపు 2.5లక్షల ఆదాయం మించిన వారి నుంచి ఆదాయపు పన్ను వసూలు చేయడం నిరాశపరిచిందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి ఆరుశాతం నిధులు కేటాయించక పోవడం దారుణం అన్నారు.

# వినాయక చవితికి మట్టివిగ్రహాలు ప్రతిష్టించాలి

**కురబలకోట, జులై 22 ప్రభాతవార్త :**



వినాయచవితికి మట్టివిగ్రహాలు ప్రతి ష్టించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఈఓపిఆర్అండ్, పంచాయితీ కార్యదర్శి లు తెలిపారు. మంగళవారం మండలం లోని జిల్లా పరనిషత్ హైస్కూల్‌లో విద్యార్థులుకు ఆయన సూచించారు. అధి కారులు అందరూ పర్యావరణ పరిరక్షణే ద్యేయంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ అవగాహన కార్యక్రమం ప్రతి పాఠశాలలకు వెళ్ళి మూడురోజులు పాటు నిర్వహిస్తున్నారు. వినాయక చవితికి మట్టి విగ్రహాలు ప్రతిష్టించి పర్యావరణా న్ని కాపాడడమే ముఖ్యమన్నారు. పండుగ రోజుల్లో బాణసంచాలు, లౌడ్‌స్పీకర్లు వినియోగం తగ్గించి శబ్దకాలుష్యం లేకుండా చూడవచ్చునని తెలిపారు. వినాయక చవితికి పిఓపి విగ్రహాలు వాడకుండా ప్రకృతి సహజంగాన లభించే బంకమన్నునే వాడి విగ్రహాలు తయారు చేయాలని వాటిని ప్రతిష్టించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సప్తగిరి గ్రామీణబ్యాంకు నూతన భవన ప్రారంభం

**రామసముద్రం, జులై 23 ప్రభాతవార్త :**



రామసముద్రం మండలం చెంబకూరు గ్రామంలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు నూతన భవనాన్ని ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాల సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఛైర్మెన్ ఏఎస్ఎన్‌ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ప్రారంభం అయి సుమారు 40సంవత్సరాలు అవుతోందని మెరుగైన సౌకర్యం కోసం బ్యాంకును నూతన భవనంలోకి మార్చడం జరిగిందని తెలిపారు. ప్రతి ఖాతాదారుడు బ్యాంకు లావాదేవీలను ఉపయోగించుకోవాలన్నారు. ముందుగా బ్యాంకు సిబ్బంది ఛైర్మెన్ ఏఎస్ఎన్ ప్రసాద్‌కు ఘనంగా స్వాగతం పలికి పుష్పగుచ్చం అందజేశారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె రీజినల్ మేనేజర్ ప్రకాష్ రత్నబాబు, బ్రాంచ్ మేనేజర్ వినోద్, ఇతర బ్యాంకు సిబ్బంది, ఏపిఎం సుబ్రమణ్యం, సంఘమిత్రాలు, బిజెపి మండల అధ్యక్షులు క్రిష్ణమూర్తి, ఇంజమ్ ఆనంద్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# వైభవంగా దుర్గలమ్మకు అభిషేకాలు

**రామసముద్రం, జులై 23 ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని బిసికాలనీలో మంగళవారం ఉదయం అర్చకులు దుర్గలమ్మకు ఆలయశుద్ధి చేసి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారిని పలు రకాల పుష్పాలతో అలంకరణచేసి భక్తులకు దర్శనబాగ్యం కల్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయంలో విద్యుత్ అలంకరణ పచ్చని తోరణాలతో అలంకరించారు. అమ్మవారిని ఊరేగింపు చేశారు. గ్రామస్థులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించడం జరిగింది.

# పారిశుద్ధ్య పక్షోత్సవ వారోత్సవాలు

**రామసముద్రం, జులై 23 ప్రభాతవార్త :**



పారిశుద్ధ్య పక్షత్సవ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 5వ తేది వరకు మం డలంలోని గ్రామ పంచాయితీల్లో కాలువ లు శుభ్రపరుచుట, ట్యాంక్ క్లీనింగ్ చేసి బ్లీచింగ్ కలుపుట వంటి తదితర పారిశుద్ధ్య కార్యక్రమాలను మండనలం లోని అని గ్రామ పంచాయితీలు ప్రతిరోజూ పారిశుద్ధ్య కారర్యక్రమాలను చేపట్టే డయేరియా, మలేరియా, డెంగ్యూ వంటి రోగాలు రాకుండా ప్రజలందరూ శ్రద్దవహించాలని తెలిపారు. ఈఓఆర్‌డి దిలీప్‌కుమార్ ఆదేశాల మేరకు చెంబకూరు గ్రామ పంచాయితీలో పలు గ్రామాల్లో కార్యదర్శి మునిస్వామినాయక్ ఆధ్వర్యంలో పలు పారిశుద్నద్య కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి మునిస్వామినాయక్, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# తహాశీల్దార్ కార్యాలయంలో తనిఖీలు

**రామసముద్రం, జులై 23 ప్రభాతవార్త :**

మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రామసముద్రం మండలంలోని తహాశీల్దార్ కార్యాలయంలో జిల్లా డిప్యూటి కలెక్టర్ రమాదేవి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఇక్కడ నుంచి మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయానికి దరఖాస్తులు సర్టిఫికెట్లు, భూములకు సంబంధించిన వంటి రికార్డులు ఆరా తీశారు. ఇతర రెవెన్యూ కార్యాలయాలపైనా నిఘా ఉంచినట్లు తెలిపారు.

# తహాశీల్దార్‌ను తనిఖీ చేసిన డిప్యూటి కలెక్టర్ లీలావతి

**బి.కొత్తకోట, జులై 23 ప్రభాతవార్త :**

అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట తహాశీల్దార్ కార్యాలయంను రాజంపేట స్పెషల్ డిప్యూటి కలెక్టర్ లీలావతి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. మదనపల్లెలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాదం సంఘటనలో భాగంగా తహాశీల్దార్ కార్యాలయంలో రికార్డుల భద్రతపై పరిశీలించారు. ప్రతి ఫైల్ వివరాలు అడిగి తెలుసుకొన్నారు. బి.కొత్తకోట మండల అధికారులకు పలువురిని విచారించారు. ఈ తనిఖీల్లో బి.కొత్తకోట తహాశీల్దార్ పుణ్యవతి, అధికారులు పాల్గొన్నారు.

# మహిళలను వేధింపులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

**వేంపల్లె, జులై 23, ప్రభాతవార్త ః**

పని ప్రదేశాల్లో మహిళలను లైంగిక వేధింపులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో వి.సునీత అన్నారు. వేంపల్లెలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం పోష్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల గురించి ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. మహిళ ఇంటినుండి బయటకు వెళ్లి ఏ ప్రాంతంలో అయితే పనిచేస్తుందో ఆ ప్రాంతం అంతా పోష్ చట్టం పరిధిలోకి వస్తుందన్నారు. ఫిర్యాదులు చేసేందుకు ప్రతి కార్యాలయంలో ఇంటర్నల్ కంప్లయిట్ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో దివిజ సంపతి, ఏఎస్సై వేణుగోపాల్, ఐసీడీ ఎస్ సూపర్‌వైజర్లు స్వర్ణలత, నాగరత్న, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

# ఏపీకి రూ.15వేల కోట్లు కేటాయించడం హర్షణీయం

**వేంపల్లె, జులై 23, ప్రభాతవార్త ః**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి రూ.15వేల కోట్లు కేటాయించడం హర్షణీయమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిహరిప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం బీజేపీ నాయకులతో కలిసి వేంపల్లెలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోడీ గ్యారెంటీ, చంద్రబాబు షూరిటీ, పవన్‌కల్యాణ్ సిన్సియారిటీతో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిందన్నారు. దీంతో రాష్ట్రాభివృద్ధి కోసం అత్యధికంగా నిధులు కేటాయించడం జరిగిందన్నారు. పోలవరం, ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి, వికసిత ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం కట్టుబడి ఉందన్నారు. విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. దాదాపు కోటి ఇళ్లకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వడం బీజేపీతోనే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మా, సునీల్, ప్రసాద్‌రెడ్డి, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

# భవితను సందర్శించిన సమగ్రశిక్ష అధికారిణి

**వేంపల్లె, జులై 23, ప్రభాతవార్త ః**

వేంపల్లెలోని భవిత దివ్యాంగ కేంద్రాన్ని సమగ్రశిక్ష అభియాన్ ట్రైనింగ్ ప్రోగ్రాం రాష్ట్ర అధికారిణి కల్పనశైల సందర్శించారు. మంగళవారం భవిత కేంద్రంలోని పలు రికార్డులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కొద్దిసేపు భవిత కేంద్రంలో చదువుతున్న చిన్నారులతో ముచ్చటించారు. ఇక్కడ చదువుతున్న చిన్నారులందరూ చక్కగా ఉన్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఈ జిల్లా కోఆర్డినేటరు కేశవరెడ్డి, అసిస్టెంట్ కోఆర్డినేటరు రమణమూర్తి, ఎంఈవోలు జాఫర్, స్టాలిన్‌తో పాటు ఐఈఆర్టీలు యశోద, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# అరచేతిలో వైకుంఠంలా కేంద్ర బడ్జెట్

**వేంపల్లె, జులై 23, ప్రభాతవార్త ః**

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏపీకి సంబంధించి అరచేతిలో వైకుంఠంలా ఉందని కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజధాని అమరావతికి వివిధ ఏజన్సీల ద్వారా రూ.15వేల కోట్లు రుణాలు ఇప్పిస్తామని చెప్పిందే తప్ప గ్రాంట్ అని చెప్పలేదన్నారు. దీన్ని బట్టి చూస్తే అప్పు మాత్రమే అనిపిస్తోందన్నారు. అయితే ఆ అప్పు ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వమే గ్రాంట్ ఇవ్వాలన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టత ఇవ్వాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏపీకి కేటాయించిన బడ్జెట్‌లో ఎలాంటి అద్భుతాలు జరగవని, ప్రత్యేకహోదా, కడప స్టీల్‌ప్లాంటు, కొత్త ఓడరేవు, విశాఖమెట్రో, రైల్వేజోన్, విజయవాడ మెట్రో గురించి ప్రస్తావనే లేదన్నారు. అలాగే పోలవరం ప్రాజెక్టుకు సహాయం చేస్తామని చెప్పారని, కానీ ఎంత అని చెప్పలేదన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యల గురించి చెప్పకపోవడం గమనార్హం అన్నారు.

# ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ముగిసిన కౌన్సెలింగ్

### - ఆర్‌కె వ్యాలీ ట్రిపుల్‌ఐటీకి 861మంది ఎంపిక

**వేంపల్లె, జులై 23, ప్రభాతవార్త ః**

ఆర్జీయూకేటీ పరిధిలోని ఆర్‌కెవ్యాలీ, ఒంగోలు ట్రిపుల్‌ఐటీలలో ప్రవేశాలకు రెండు రోజులుగా నిర్వహించిన కౌన్సెలింగ్ మంగళవారంతో ముగిసింది. దీంతో ఆర్‌కె వ్యాలీ ట్రిపుల్‌ఐటీకి 861మంది విద్యార్థులు ఎంపికయ్యారు. అడ్మిషన్ల ప్రక్రియను అడ్మిషన్ల కన్వీనరు ఎస్.అమరేంద్ర, వీసీ ప్రొఫెసర్ ఎం.విజయ్‌కుమార్‌లు పర్యవేక్షించారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ సిబ్బంది పాల్గొన్నారు.

# బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు తప్పవు

**పోరుమామిళ్ల, జూలై 23 ప్రభాతవార్త :**

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ తిమోతి హెచ్చరించారు. మంగళవారం పోరుమామిళ్ల పట్టణంలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే ప్రాంతాల్ని పరిశీలించారు. పలు ప్రదేశాలను వర్కర్ల సహాయంతో శుభ్రం చేయించారు. బహిరంగ ప్రదేశాలలో ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

# నాగబాబును కలిసి పోరుమామిళ్ల జనసేన నాయకులు

**పోరుమామిళ్ల, జూలై 23 ప్రభాతవార్త :**

జనసేన రాష్ట్ర ప్రదాన కార్యదర్శి నాగబాబును మంగళగిరి పార్టీ కార్యాలయంలో మంగళవారం పోరుమామిళ్ల మండల జనసేన నాయకులు ఎక్కలూరి సిద్దు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లామని ఆయన సానుకూలంగా స్పందించారని, అలాగే ఎన్నికల సమయంలో కష్టపడి పనిచేసిన జనసేన కార్యకర్తలను గుర్తించాలని కోరినట్లు పేర్కొన్నారు. పేదల అభివృద్ధికి కృషి చేయాలని కోరారన్నారు.

# డిప్యూటి సీఎంను కలిసిన భూమిరెడ్డి సాయిశ్రీనివాసరెడ్డి

**వేంపల్లె, జులై 23, ప్రభాతవార్త ః**

డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్‌ను ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి తనయుడు, తెదేపా యువ నాయకుడు భూమిరెడ్డి సాయి శ్రీనివాసరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వేంపల్లె అభివృ ద్ధిపై డిప్యూటి సీఎంతో మాట్లాడారు.

# మంత్రులను కలిసిన పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి

**పులివెందుల రూరల్, జులై 23, ప్రభాతవార్త ః**

పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) మంగళవారం పలువురు మంత్రులను కలిశారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్ధన్‌రెడ్డిని ఆయన కలిసి అధ్వానంగా మారిన పులివెందుల నియోజకవర్గంలోని ప్రధాన రోడ్లు, గ్రామాల అంతర్గత రోడ్లు మరమ్మతుల కోసం నిధులు కేటాయించాలని కోరారు. అలాగే రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను బీటెక్ రవి కలిసి పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రి నందు వైద్యులు, నర్సుల కొరత, కార్పొరేట్ ఆసుపత్రికి అనుగుణంగా పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని, త్వరలో ఒక ప్రణాళిక రూపొందించాల్సిందిగా కోరారు.

# అనుమతిలేని లే అవుట్లకు అనుమతి ఇవ్వబడదు

**పీలేరు, జూలై 23 ప్రభాతవార్తః**

పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో అనుమతి లేఅవుట్లుకు పంచాయతీ అనుమతి ఇవ్వబడదని ఈఓ గురుమోహన్ అన్నారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చుడా చిత్తూరు అర్బన్ అథారిటీ డెవలప్‌మెంటు వారి ఆదేశాల మేరకు పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ కింది సర్వేనెంబర్లలో ఇల్లు నిర్మించబోయే లబ్దిదారులకు పీలేరు గ్రామ పంచాయతీ అప్రూవల్ ఇవ్వబడదని తెలియజేశారు. అలాగే మట్టి విగ్రహాలను వాడాలన్నారు. పీఓపీ విగ్రహాలు వాడడం వల్ల వాతావరణ కాలుష్యం ఎక్కువ అవుతుందని వాతావరణ కాలుష్య నివారణకు అందరూ సహకరించాలన్నారు. పీలేరు పట్టణంలో ప్రజల వచ్చిన పిర్యాదుల మేరకు కుక్కలను కూడ పట్టుతున్నారు.

# తపాల పథకాలను సద్వినియోగం చేసుకోండి

**పీలేరు,జూలై 23 ప్రభాతవార్తః**

ప్రజలు తపాలా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పీలేరు పోస్టల్ ఇన్స్‌పెక్టర్ వినోద్‌కుమార్, మంగళవారం స్థానిక పోస్టల్ కార్యాలయంలో ఆయన బుధ, గురువారాలలో నిర్వహించనున్న డాక్ చౌపల్ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖలో అన్ని సేవింగ్ ఖాతాలతో పాటు డిపాజిట్లపై ఆకర్షణమైన వడ్డీ ఇస్తున్నామని, బాలికలకు సుకన్య పథకం , మహిళా సమ్మాన్ యోజన పథకాలను అమలు చేస్తున్నందున అందరు ఖాతాలను తెరుచుకోవడం వల్ల మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. బుధవారం ఈకార్యక్రమాన్ని పీలేరు పట్టణం శివారులోని మోడల్ కాలనీలో ఇంటింటికి తపాలా సేవలు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన వివరించారు. ఈఅవకాశాన్ని పీలేరు పట్టణ , గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలనన్నారు. ఈకార్యక్రమంలో ఖాతాదారులు పాల్గొన్నారు.

# స్టాప్ డయేరియా అంశంపై విద్యార్థులకు అవగాహన

**పీలేరు, జూలై 23 ప్రభాతవార్తః**

పట్టణంలోని జిల్లా పరిషత్ కోటపల్లె పాఠశాల నందు స్టాఫ్ డయేరియా అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డయేరియా లక్షణాలు, కారణాల గురించి వివరించారు. అలాగే నివారణ పద్దతులు, స్టాఫ్ డయేరియా ప్రచారం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. జల్ జీవన్ మిషన్ యొక్క ప్రధాన లక్ష్యాలు, ఉపయోగాలు, నీటి పొదుపు పద్ధతులు, మానవ వ్యక్తిగత పరిశుభ్రత వాటి ప్రాముఖ్యతపై కమ్యూనిటీకి వివరించారు. పాఠశాల పిల్లలకు హ్యాండ్ వాష్ పద్దతులు, విద్యార్థులందరూ స్టాఫ్ డయేరియా, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై గ్రామాల్లో మౌత్ పబ్లిసిటీని ప్రోత్సహించాలని, ప్రచారం చేయాలని అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం రెడ్డిబాబురెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆర్‌డబ్ల్యూయస్ అధికారులు రఘునాధరెడ్డి, మురళీకష్ణ తదితరులు పాల్గొన్నారు.

# హోం మంత్రిని కలిసిన పీలేరు మహిళా టీడీపీ నేత

**పీలేరు, జూలై 23 ప్రభాతవార్తః**



పీలేరుకు చెందిన టీడీపీ మహిళా నేత పుష్పావరద మంగళవారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను కలిశారు. రాష్ట్రాన్ని వేధిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమేసేందుకు తన కుమారుడు చైతన్య, రాష్ట్రానికి పెట్టుబ డులు ఆకర్షించేందుకు తన కుమార్తె రోహిణీరాయ్ రూపొందించిన ప్రణాళికల ను హోం మంత్రికి అందజేసినట్లు పుష్పావరద తెలిపారు. తాము అందించి న ప్రాజెక్టులపై ఆమె ఆసక్తి కనబరిచారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకున్నట్లు హోం మంత్రి తెలిపారని పుష్పా తెలిపారు.

# లైగింక వేధింపులపై అవగాహణ

**దువ్వూరు, జూలై 23, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని వివిధ బహిరంగ ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులు జరగకుండ ఉండేందుకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సభా భవన్‌లో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహణ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఎంపీడీఓ సుగుణ శ్రీ మాట్లాడుతూ ఫోక్సో 2013వంటి చట్టాలను గురించి వివరించారు. మహిళలు పనిచేసే చోట వేధింపులకు గురౌతున్నారని వాటిని నివారించేందుకు గాను ప్రభుత్వం ఒక కాల్ సెంటర్ ఏర్పాటుచేసిందని వాటికి ఫోన్‌చేస్తే తగు రీతిలో కఠినచర్యలు తీసుకుంటారన్నారు. అలాగే పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు హైస్కూల్, పాఠశాలల వద్ద తగు నిఘా ఏర్పాటు చేయాలన్నారు. మహిళలకు వేధింపులకు గురిచేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఈ సదస్సులో ఐసీడీఎస్ చాపాడు సీడీపీఓ సావిత్రమ్మ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ మహిళలకు జరుగుతున్న వేధింపులపై ప్రజలకు అవగాహణ కల్పిస్తున్నామన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడి కేంద్రాల ద్వారా కూడ ప్రచారం నిర్వహిస్తున్నట తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్, డిప్యూటి తహసీల్దార్ ఆలీఖాన్, సూపర్‌వైజర్ సౌజన్య పాల్గొన్నారు.

# బహిరంగ మధ్యపానం చేస్తే కఠిన చర్యలు తప్పవు -ఎస్ఐ

**దువ్వూరు, జూలై 23, ప్రభాతవార్త:**

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీనివాసులు మందుబాబులపై దృష్టి సారించారు. ఈ మధ్య చాలా మంది బహిరంగంగా మద్యం తాగుతూ, తాగిన మత్తులో మద్యం బాటిల్లను ఇష్టారాజ్యంగా రోడ్లపై, పొలాల్లో ఎక్కడ పడితే అక్కడ బాటిళ్లను పగలగొట్టడంంతో ఆ పరిసరాల్లో పాదాచారులకు, రైతులకు ఇబ్బందికర వాతావరణం సృష్టిస్తున్న నేపధ్యంలో ఎస్ఐ సిబ్బంది, పంచాయతీ సిబ్బందితో కలిసి దువ్వూరు చుట్టుప్రక్కల మందుబాబులు మద్యం తాగుతున్న ప్రదేశాలను గుర్తించి అక్కడ దాడులు నిర్వహించి వారిపై కేసు నమోదు చేయడంతో పాటు అక్కడ ఉన్న మద్యం సీసాలను, సీసా ముక్కలను తొలగించారు.

# విద్యుత్ కార్మికుని కుటుంబానికి మేడా రఘునాధ రెడ్డి లక్ష సాయం

**రాజంపేట అర్బన్, జూలై 23, ప్రభాతవార్త:**

వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి పర్యటన అనంతరం విద్యుత్ లైన్లు సిద్ధం చేస్తుండగా ప్రమాదవశాత్తు జరిగిన విద్యుత్ ప్రమాదంలొ మరణించిన ఏనుగుల హరీష్ కుమార్ కుటుంబానికి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాధ రెడ్డి లక్ష రూపాయల ఆర్ధిక సహాయాన్ని అందజేశారు. ఈ మేరకు లక్ష సొమ్మును హరీష్ కుమార్ భార్య మొలకల లక్ష్మి దేవి బ్యాంక్ ఖాతాకు మంగళవారం జమచేశారు. ఈ విశయాన్ని స్థానిక వైసిపి నేత, మున్సిపల్ కౌన్సిలర్ కూండ్ల వెంకట రమణారెడ్డి వెల్లి మృతుని తండ్రి, నూనెవారిపల్లె వైసిపి నేత మణికి తెలియజేశారు. అంతేకాకుండా హరీష్‌కుమార్ బార్యకు ఉద్యోగం ఇప్పించే ఏర్పాటు ఎంపీ చేస్తారని తెలిపారు. ఆర్థిక సహాయం అందించిన ఎంపీ మేడా రఘునాధరెడ్డికి మృతుని కుటుంబం కృతజ్ఞతలు తెలియజేసింది.

# ఓవర్‌హెడ్ ట్యాంక్ చుట్టూ పేరుకుపోయిన మొక్కలను తొలగించాలి

**బి.కోడూరు, జూలై 23 ప్రభాతవార్త :**

మండలంలోని రాజుపాళెం గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ గత వైకాపా ప్రభుత్వంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్లక్ష్యానికి గురైందని, ఈ మేరకు వాటర్ ట్యాంకు చుట్టూ పిచ్చిమొక్కలు అధికంగా పెరిగాయని వాపోతున్నారు. దీంతో గ్రామస్థులు ట్యాంక్ దద్దరకు వెళ్లలేకుండా ఉన్నారని తక్షణమే చరవ తీసుకుని ట్యాంకు చుట్టూ ఉన్న కంపచెట్లను, పిచ్చిమొక్కలను తొలగించాలని కోరుతున్నారు.

# ముద్ద వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి

**చిట్వేలి, జులై 23, ప్రభాతవార్త:**



ఆవులకు సంక్రమించే ముద్ద వ్యాధి నివారణకుటీకాలు తప్పనిసరిగా వేయించాలని ప్రాంతీయ పశువైద్యశాల బాధ్యులు కేడీ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం చిట్వేలి మండలంలో స్థానిక వైద్యులు భువనేశ్వరి ఆధ్వర్యంలో చెర్లోపల్లి గ్రామంలో ఆవులకు ఈ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తెల్ల పశువులకు సంక్రమించే ఈ ముద్ద ప్రాణాంతక వ్యాధి నుంచి కాపాడే దిశగా 2500 పశువులకు టీకాలు వేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆహాలతో పాటు గోపాల మిత్రలు పాల్గొన్నారు.

## ఆధార్‌అప్‌డేటలను సద్వినియోగం చేసుకోండి ఎంపిడివో

పెద్దమండ్యం జూలై 23 ప్రభాతవార

మండలంలోని ప్రభుత్వపాఠశాలల్లో నాలుగురోజులపాటు ఉచితంగా ఆధార్‌లలో తప్పుఒప్పులను సరిచేయడానికి భ్రుత్వంఆధార్ సెంటర్లను ఏర్పాటుచేసింది.మండలప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని ఎంపిడివో వెంకటరమణయ్యకోరారు.మంగళవారం ఎంపిడివో, కార్యదర్శులు జగన్,జనార్దనలు ఆధార్‌సెంటర్లను పరిశీలించి ప్రజలకు ఎలాంటి సమస్యనైనా పరిష్కరించాలని కోరారు.ఈనెల27వరకూ అందుబాటులో ఉంటాయని ప్రజలు సద్వినిమోగం చేసుకోవాలని కోరారు.

## ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవు

పెద్దమండ్యం జూలై 23 ప్రభాతవార్త



గ్రామంలోని ప్రజలకు ఇబ్బందుల కలిగిస్తే చర్యలుతప్పవని ఎంపిడివో వెంకటరమణయ్య చికెన్‌నిర్వాహకులకు మంగళవారం హెచ్చరించారు. చికెన్ నిర్వాహకులు చికెన్‌వ్యర్థాలను గ్రామంసమీపం లోని చెరువుకట్ట పైవేయడంవల్ల దుర్వాసనరావడం జరుగుతుందని స్థానికులు ఆరోపించారు.దీంతోద్విచక్ర వాహనదారులకు పాదచారులకు ఇబ్బందులుకు గురికావడంజరుగుతుంది. దీంతోఎంపిడివోవెంకటరమణయ్య,కార్యదర్శుల ఎజగన్,జనార్దనలు నిర్వాహకులతో సమావేశమై చికెన్‌వేస్టేజ్‌నుగ్రామా నికదూరంగా వేయాలని ఎండినతరువాత నిప్పుపెట్టి కాల్చివేయాలని సూచించారు.మీపైఇంకోసారి ఫిర్యాదులు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మెచ్చరించారు.

## సీఎం సతీమణి భువనేశ్వరమ్మకు ఘన స్వాగతం పలికిన ఖాదర్‌బాషా

రాయచోటి, జులై 23, ప్రభాతవార్త:



ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరమ్మ మంగళవారం కుప్పం నియోజకవర్గ పర్యటనకు వచ్చిన సందర్భంగా తెదేపా రాష్ట్ర కార్యదర్శి కుప్పం నియోజకవర్గ పరిశీలకులు గాజుల ఖాదర్‌బాషా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన కుప్పం పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి పూల బొకే ఇచ్చి సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు జాకీర్, టీడీపీ నాయకులు ఫైరోస్ జాలు అబ్దుల్లా, కౌన్సిలర్ దాము తదితరులు పాల్గొన్నారు.

## ఏపీకి కేంద్ర బడ్జెట్‌లో పెద్దపీట చంద్రబాబు ఘనతే

– టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు ప్రసాద్‌బాబు



రాయచోటి, జులై 23, ప్రభాతవార్త:

ఏపీకి కేంద్ర బడ్జెట్‌లో పెద్దపీటకు చంద్రబాబు ఘనతే కారణమని రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు ప్రసాద్ బాబు అన్నారు. ఏపీ పునర్ నిర్మాణానికి రూ.15వేల కోట్లు, ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు అధిక నిధులు కేటాయింపు, వైజాగ్, చెన్నై పారిశ్రామిక కారిడార్ నిర్మాణానికి అధిక నిధులు కేటాయింపు, వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో లభిస్తున్న ప్రాధాన్యతే తార్కానమన్నారు.

## వెంకటేశ్వర స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి

రామాపురం, జులై 23, ప్రభాతవార్త:



సాక్షాత్తు కలియుగ దైవమైన వెంకటేశ్వర స్వామి ప్రపంచ వ్యాప్తంగా భక్తులున్న శ్రీవేంకటేశ్వర స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన న్యాయవాది కదిరి కృష్ణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా విశ్వహిందూ పరిషత్ బజరంగదళ్ సహ సంయోజక్ వీరారెడ్డి బజరంగదళ్ లక్కిరెడ్డిపల్లె ప్రఖండ అధ్యక్షులు ప్రసాద్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. ఒక న్యాయ వృత్తిలో ఉంటూ ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వారిని తీవ్రంగా శిక్షించాలని అలాగే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రఖండదళ్ కార్యదర్శి దామోదర్ నాయుడురెడ్డి, విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు వెంకటరమణ, జయరాంరెడ్డి, వెంకటేష్, గంగాధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## తంబళ్లపల్లెలో భూగర్భ జలాలు పెరిగాయి

– అమీదా భాను



తంబళ్లపల్లె, జులై 23, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలం పరిసరాల్లో ఈమధ్య కురిసిన వర్షాలకు భూగర్భ జలాలు విరివిగా పెరిగినట్లు జిల్లా హైడ్రోజియాలజిస్ట్ అమీదాభాను తెలిపారు. మంగళవారం ఆమె మండలంలోని పలు భూగర్భ జలాల లెక్కింపు సెంటర్లలో భూగర్భ జల పరిధిని లెక్కించారు. గత జూన్ నెల భూగర్భ జలాలు కంటే జులై మాసంలో భూగర్భ జలాలు పెరిగినట్లు చెప్పారు. గత నెలలో 14.96 మీటర్ల వాటర్ లెవెల్ ఉండగా జులైలో 12.27 మీటర్లుగా ఉండి రెండు మీటర్లకు పైగా భూగర్భ జలాలు పెరిగాయన్నారు. గోపిదిన్నెలో 14.92 మీటర్లు, పోలీసు స్టేషన్‌లో 10.96 మీటర్లుగా నమోదయ్యాయి. అదే విధంగా కన్నెమడుగు సబ్ స్టేషన్‌లోని వాటల్ లెవెల్ తనిఖీ నిర్వహించారు. ఈ భూగర్భ జలాల లెక్కింపు కార్యక్రమం ప్రతి నెల నిర్వహించబడుతుందని విలేకరులకు తెలిపారు.

## ఆధార్ సెంటర్‌లను సద్వినియోగం చేసుకోండి

– ఏవో ఆనంద్‌కుమార్



తంబళ్లపల్లె, జులై 23, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలోని ప్రతి ఒక్కరూ తమ సమస్యల పరిష్కారానికి సంచార ఆధార్ కేంద్రాల ద్వారా పరిష్కరించుకోవాలని ఎంపీడీవో కార్యాలం ఏవో ఆనంద్‌కుమార్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23, 24 తేదీల్లో కొటాల సచివాలయం, 25, 27 తేదీల్లో తంబళ్లపల్లె-1 సచివాలయం, 23, 25 తేదీల్లో కన్నెమడుగు సచివాలయం, 26, 27 తేదీల్లో రేణుమాకులపల్లి సచివాలయంలో ఆధార్ సేవలు కొనసాగుతాయన్నారు. విద్యార్థులు, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

## మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ నగదు పంపిణీ

కలికిరి, జులై 23, ప్రభాతవార్త:




కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షా ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు తిమ్మారెడ్డి మెమోరియల్ మెరియట్ స్కాలర్‌షిప్‌లను విద్యార్థులకు అందజేశారు. మొదటి బహుమతి పి.తరుణ్‌కు రూ.25వేలు, 2వ బహుమతి సాయికుమార్‌కు రూ.15వేలు, 3వ బహుమతి బి.అజయ్‌కి రూ.10వేలు రూపాయలు చెక్కులను ప్రధానోపాధ్యాయుని ద్వారా అందజేశారు. ముగ్గురు విద్యార్థుల తల్లిదండ్రులు పేద కుటుంబానికి చెందిన వారు కావడం వారు కష్టపడి పిల్లలను చదివించారు. వారి కష్టాలను గుర్తించి ముగ్గురు విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు ప్రతిష్టలు తీసుకురావడం జరిగింది. విద్యార్థులను మేధావులు సైతం అభినందించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శారదా, సీనియర్ ఉపాధ్యాయులు డి.లోకేశ్వరమ్మ, ఎన్.వెంకటరమనారెడ్డి, మరియు ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

## పంచాయతీ అభివృద్ధికి వార్డు సభ్యులు సహకరించాలి

– సర్పంచ్ ఎ.రెడ్డిరామ్

కలికిరి, జులై 23, ప్రభాతవార్త:

పంచాయతీ అభివృద్ధికి వార్డు సభ్యులందరూ సహకరించాలని మర్రికుంటపల్లె పంచాయతీ సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ పేర్కొన్నారు. పంచాయతీ కార్యాలయంలో వార్డు సభ్యులతో మండల స్థాయి అధికారుల ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల్లోని 18 గ్రామాలు అభివృద్ధి చేసుకునేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఏ చిన్న సమస్య వచ్చినా తామంతా ఉమ్మడిగా సమావేశమై చర్చించుకొని పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సహకారంతో పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించుకుందామని సర్పంచ్ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గాయత్రి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి వరాల జల్లు

బిజెపి ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి

ఖాజీపేట, జూలై 23, ప్రభాతవార్త:

ప్రధానమంత్రి నరేంద్ర మోడి నేతృత్వంలో కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి మంగళవారం పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీఏ ప్రభుత్వంపై వరాల జల్లు కురిపించారని కడప జిల్లా భారతీయ జనతాపార్టీ ఉపాధ్యక్షురాలు ఎన్.లక్ష్మీదేవి పేర్కొన్నారు. మంగళవారం లక్ష్మీదేవి విలేకరులతో మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి ఏపీ ప్రజలు అపూర్వ విజయాన్ని అందించినందుకు ఫలితం దక్కిందన్నారు. ప్రజలు ఇచ్చిన మన విజయాన్ని తన సొంతం కోసం కాకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం వాడుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి సత్ఫలితాలను ఇచ్చిందని కేంద్ర బడ్జెట్‌లోఏపీకి అత్యధిక ప్రాధాన్యత దక్కిందని ప్రజల పక్షపాతిగా దేశం కోసం ధర్మం కోసం ప్రతినిత్యం ప్రజల కోసం ఆరాటపడుతున్న ప్రధానమంత్రిగా మూడవసారి బాధ్యతలు చేపట్టి ఏపీ ప్రజలు గత ఐదు సంవత్సరాల నుండి అంధకారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రజలను దృష్టిలో పెట్టుకొని ఏపీకి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోడిని కొనిఆడారు.

## ఏపీకి నిధులు తెప్పించడంలో చంద్రబాబు, పవన్‌లు విఫలం

– యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఆర్టీఐ ఛైర్మన్ లక్ష్మయ్య

కడప వైద్యవిభాగం, జులై 23, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్‌కు నిధులు రప్పించడంలో చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లు పూర్తిగా విఫలం చెందారని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఆర్టీఐ ఛైర్మన్ కోటపాటి లక్ష్మయ్య అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీ రాజధాని కోసం రూ.15వేల కోట్లు నామమాత్రపు సాయ ప్రకటన అది కూడా కేంద్ర ఏజెన్సీల ద్వారా అప్పులు ఇప్పించే ప్రణాళిక అన్నారు. పోలవరంపై స్పష్టమైన హామీ ఇవ్వలేదని ప్రత్యేక హోదా ప్రస్తావనే లేదన్నారు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ప్రస్తావనే లేదన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌లు ఎన్డీఏ ప్రభుత్వంలో ఉండి కూడా ఏమీ చేయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

## రూరల్ సీఐ ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమం

ప్రొద్దుటూరు క్రైం, జులై 23, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు రూరల్ పరిధిలోని అమృత్‌నగర్‌లోని ఉర్దూ స్కూలు, హాస్టల్, సచివాలయం తదితర ప్రాంతాల్లో , ఖాళీ ప్రదేశాల్లో మందు తాగి బాటిళ్ల పడేసి పర్యావరణాన్ని పాడు చేయొద్దు అంటూ ప్రొద్దుటూరు రూరల్ సీఐ రమణారెడ్డి, ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలలో ఉన్న చెత్త, కాగితాలు, ప్లాస్టిక్ బాటిళ్ల తదితర వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా చేయించారు. బహిరంగ ప్రదేశాల్లో మందుబాబులు మందు తాగడం వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అలాంటలి వారిలో మార్పు రాకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ రమణారెడ్డి హెచ్చరించారు.

## నవ్యాంధ్ర బలిజ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

లక్కిరెడ్డిపల్లె,జులై 23,ప్రభాతవార్త:



2024 నుంచి 2026 వరకు నవ్యాంధ్ర బలిజ సంఘం నూతన కార్యవర్గంను ఎన్నుకున్నట్లు నవ్యాంధ్ర బలిజ సంఘం వ్యవస్థాపకులు కె.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నవ్యాంధ్ర బలిజ సంఘం మండల అధ్యక్షులుగా కావలి ఆంజనేయులు,ప్రధాన కార్యదర్శిగా గోవిందు శ్రీకాంత్,సలహాదారులుగా యనమల మదన్ మోహన్,వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గంటా వెంకట కృష్ణయ్య,కోశాధికారిగా యనమల విశ్వనాథ్,గౌరవాధ్యక్షులుగా కడియాల వెంకట సూర్య ప్రసాద్,మచ్చు రెడ్డన్న,దొంతు రవిశంకర్ ప్రసాద్,ఉపాధ్యక్షులుగా మురికి నాటి రెడ్డయ్య,నగుబోతు భాస్కర్,రాజా, కటవమీద ఆంజనేయులు, కార్యదర్శులుగా మురికినాటి వేణు,చిన్న కొండు భాస్కర్,గంగిశెట్టి,శివరాం లను ఎనుకోవడం జరిగిందన్నారు.

## మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులను అరికట్టాలి

బద్వేలు, జూలై 23 ప్రభాతవార్త :

మహిళలపై జరుగుతున్న లైంగిక వేదింపులను అరికట్టేఉందుకు ప్రవేశపెట్టిన పోష్ చట్టం పై మహిళలందరికీ అవగాహన కల్పించాలని జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ సాధికారత అధికారిణి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ , ప్రైవేటు మరియు ఇతర సంస్థలలో పనిచేస్తున్న వారు అనగా అసంఘటిత మరియు సంఘటిత రంగాలకు చెందిన 10 మందికి పైగా ఉద్యోగులు కలిగిన సంస్థలు అన్ని ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటిలు ఏర్పాట చేయాలని కోరారు. ఈ కమిటి 3 సంవత్సరాల కాల పరిమితితో పనిచేస్తుందన్నారు. అంతేగాక చిన్న పిల్ల రక్షణ కొరకు 1098 మరియు మహిళల సమస్యల కొరకు 181, 112 టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. వేదింపులకు గురైన మమిళలు మున్సిపాలిటీ స్థాయిలో కమిషనర్‌కు అలాగే మండల స్థాయిలో తహశీల్దార్లకు ఫిర్యాదు చేయవచ్చని తెలియజేశారు. ఒకవేళ నేరుగా అధికారులకు ఫిర్యాదు లేయలేని పరిస్థితులలో మహిళలు ఉంటే ప్రతి కార్యాలయం నందు ఒక కంప్లైంట్ బాక్స్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రమోహన్ మాట్లాడుతూ ఈ చట్టమును ప్రతి ప్రభుత్వ మరియు ప్రైఏటు కార్యాలయాల యందు నిష్పక్షపాతంగా అమలుపరచాలని సూచించారు. అదేవిధంగా గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయడంతో పాట ప్రజలకు అవగాహన ఇచ్చే కార్యక్రమాలు చేపట్టాలని తెలియజేశారు. అనంతరం డిఎస్పీ వెంకటేశులు మాట్లాడుతూ ప్రతి సంస్థ కార్యాలయాల యందు మహిళలు వేధింపులకు గురికాకుండా ఉండేందుక ఈ చట్టం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సడీపీవో యం.శ్రీదేవి, యస్. శ్రీదేవి, డీఎల్‌డిఒ రజనీకాంత్, తహశీల్దారు, ఎంపీడీవో, ఎంఈవో, పంచాయతీరాజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముద్దాయికి జీవిత ఖైదు - రూ.2వేలు జరిమానా

సుండుపల్లె, జులై 23, ప్రభాతవార్త:

మండలంలోని సుండుపల్లె గ్రామం బల్లిపల్లికి చెందిన నంద్యాల ఆనంద్ అనే ముద్దాయికి జీవిత ఖైదు, రూ.2వేలు జరిమానా, 3 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు జిల్లా 5వ జడ్జీ కృష్ణన్ కుట్టి మంగళవారం తీర్పును వెల్లడించారు. నంద్యాల ఆనంద్ మరియు అతని భార్య ఇద్దరు కలిసి బతుకు దెరువు కోసం కువైట్‌కు వెళ్లి అక్కడ ఆనంద్ భార్య ధనలక్ష్మీ అక్రమ సంబంధం పెట్టుకొని ఉందని తెలిసి ఆనంద్ చాలా సార్లు హెచ్చరించినా వినకపోవడంతో కువైట్ నుంచి ఎవరికి తెలియకుండా 2004వ సంవత్సరం సుండుపల్లికి తీసుకొని వచ్చి రాత్రి సమయంలో ఊటువంక వద్దకు తీసుకొని పోయి అక్కడ కట్టెతో బలంగా తలపై కొట్టి చంపి అక్కడే ఇసుకలో పూడ్చిపెట్టి తరువాత ఎవరికి తెలియకుండా కువైట్ వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. ధనలక్ష్మీ అమ్మ పోకల చిన్నక్క సుండుపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. తరువాత అప్పటి ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి 2007లో ఆనంద్ సుండుపల్లికి వచ్చిన తరువాత పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. అప్పటి రాయచోటి రూరల్ సీఐ ఖాసీంసాహెబ్ ఎస్సై వెంకటేశ్వర్లు ఛార్జిషీటు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు విచారించి ముద్దాయికి మంగళవారం జీవిత ఖైదును విధించారని రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్, ఎస్సై హుసేన్‌లు తెలిపారు.

## చిట్వేలి ఉర్దూ పాఠశాలకు బోధకుడు కరువు

– పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రుల ఆందోళన – అధికారులకు వినతిపత్రం అందజేత



చిట్వేలి, జులై 23, ప్రభాతవార్త:

చిట్వేలిలో ఉన్న ఏకైక ఉర్దూ పాఠశాలకు ఉర్దూను బోధించే బోధకుడు గత 4 సంవత్సరాలుగా లేకపోవడంతో మా పిల్లల భవిష్యత్తు ఏమిటని ముస్లిం మతస్తులు అధికారులను ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు గాడి ఇంతియాజ్ అహ్మద్, షేక్ షబ్బీర్ బాషా, షేక్ మహబూబ్బఆషా, సీపీఐ జిల్లా కార్యదర్శి పందికాళ్ల మణి, విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ఎంఈవో కోదండ నాయుడుకు, ఇన్‌ఛార్జి ఎంఆర్ఓ సుమని కి వినతిపత్రం అందజేశారు. ఇంతియాజ్ మాట్లాడుతూ సుమారు 60 సంవత్సరాల నుంచి చిట్వేలిలో ప్రభుత్వ ఉర్దూ మాధ్యమ పాఠశాల కొనసాగుతుందన్నారు. 40 మందికి పైగా విద్యార్థులు ఉన్నా బోధకులు లేక ప్రస్తుతం ఆ సంఖ్య 14 చేరిందని వాపోయారు. బదిలీల్లో భాగంగా ఉన్న ఇద్దరు బోధకులు వెళ్లడంతో ఈ ఇబ్బంది తలెత్తిందని వారన్నారు. జిల్లా అధికారులకు సమస్యను వివరించినా ఫలితం లేకపోయిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అయినా మా ఇబ్బందిని గుర్తించి పిల్లల భవిష్యత్తు దృష్ట్యా కనీసం ఒకరినైనా ఉర్దూ బోధకుడిని నియమించేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టాలని ముక్తకంఠంతో విన్నవించారు. ఈ కార్యక్రమంలో మౌలానా జవహర్ అలీ, కాశ్మీ, హఫీస్ అద్నాన్, అష్వాక్, మాపీర్, యాసీన్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

– అన్నమయ్య జిల్లా విద్యాధికారి శివప్రసాద్‌రెడ్డి

గాలివీడు, జులై 23(ప్రభాతవార్త):



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి యు.శివప్రసాద్‌రెడ్డి సూచించారు. శిక్ష సప్తాహ్‌లో భాగంగా మంగళవారం గాలివీడు మండల కేంద్రంలోని గేటు ఉర్దూ స్కూల్, బాలుర ఉన్నత పాఠశాల, కస్తూరిబా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై అకాడమీ విద్యాప్రణాళికలపై తగు సలహాలు, సూచనలు చేశారు. అంతగాక బాలుర ఉన్నత పాఠశాలలో ఈ ఏడు ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, బ్యాగ్‌తో కూడిన కిట్‌ను అందజేస్తామన్నారు. గుర్రాలమిట్ట వద్ద గల కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమైన ఆయన విద్యార్థులు ఆరోగ్యం దృష్ట్యా సీజనల్ వ్యాధులు, డయోరియాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బాలికల పట్ల మరుగుదొడ్ల పనితీరు, మౌలిక సదుపాయాలు తదితర విషయాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు పిల్లి నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి - ఎస్ఐ

ముద్దనూరు, జులై 23, ప్రభాతవార్త:

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని ఎస్ఐ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ముద్దనూరు పట్టణంలో ఎస్ఐ మెయినుద్దీన్ తహసీల్దార్ కార్యాలయం, క్లబ్ ఆవరణంలో మరియు శ్రీ వివేకవర్ధిని కళాశాల చుట్టుప్రక్కల స్వచ్ఛభారత్, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని మంగళవారం నాడు పోలీస్, పంచాయతీ సిబ్బందితో కలిసి చేపట్టారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగడం, ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై మద్యం సీసాలను పడేసి అపరిశుభ్రత తలపించేలా ఉండటం సరికాదన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రోడ్లపై చెత్త, చెదారం వేయకుండా పంచాయతీ వారు వచ్చినప్పుడు వారి వాహణాలలో చెత్తను వేయాలని అలా కాకుండా ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై వేసి అపరిశుభ్రంగా ఉంచుకోవద్దన్నారు. నివాసాల వద్ద పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే పట్టణంలో కళాశాలలు, పాఠశాలలు పలు ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాకాకుండా ఎక్కడపడితే అక్కడ చెత్త, మద్యం బాటిళ్లు వేస్తే వారిపై చర్యలు తీసుకొని వారికి జరిమానా విధిస్తామన్నారు. పోలీస్ నిబంధనలకు లోబడి ప్రతి ఒక్కరూ ఉండాలని చట్టాన్ని గౌరవించాలని వారు తెలిపారు.

## అరుణాచలం మృతి పట్ల మదన్ సంతాపం

రాజంపేట అర్బన్, జూలై 23, ప్రభాతవార్త:

మాజీ మంత్రి బండారు రత్న ప్రభావతి తనయుడు అరుణాచలం(72) మృతి పట్ల రాజంపేట మాజీ ఎమ్మెల్యే కసిరెడ్డి మదన్ మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో నీతి, నిజాయితికి మారుపేరుగా, సీనియర్ నేతగా ప్రజలకు ఎంతో సేవ చేసిన బండారు అరుణాచలం మృతితో ఒక మంచి సన్నిహితున్ని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. అరుణాచలం కుటుంబ సభ్యులకు మదన్ తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## ఆర్యవైశ్య సంఘం నేత సనిశెట్టి నారాయణ మృతి

రాజంపేట అర్బన్, జూలై 23, ప్రభాతవార్త:

రాజంపేట క్లాత్ మర్చంట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సనిశెట్టి నారాయణ(82) మంగళవారం మృతి చెందారు. 2003వ సంవత్సరం నుంచి 2018 వరకు దాదాపు 15ఏళ్ల పాటు నారాయణ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడుగా కొనసాగి వస్త్ర వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఆయన అధ్యక్షుడుగా ఉన్నప్పుడు అసోసియేషన్ సభ్యుల సహకారంతో క్లాత్ మర్చంట్ అసోసియేషన్‌కు సొంత భవణాన్ని నిర్మించారు. ప్రొద్దుటూరు తరువాత రాజంపేటలోనే క్లాత్ మర్చంట్ అసోసియేషన్‌కు సొంత బిల్డింగ్ ఉండటం విశేషం. 2003వ సంవత్సరం నుంచి 2006వరకు ఆర్యవైశ్య సంఘం కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవికి వెండి రథం నిర్మాణంలో ఆయన ముఖ్యపాత్ర పోషించారు. అలాగే పట్టణంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ పున: నిర్మాణంలో కోశాధికారిగా పనిచేశారు. సనిశెట్టి నారాయణ మృతి పట్ల ఆయన మనవడు మున్సిపల్ కౌన్సిలర్ సనిశెట్టి నవీన్‌కుమార్, వైసిపి నేత అన్నపూర్ణ మురళి సంతాపం వ్యక్తం చేశారు.

## రికార్డులు కాల్చితే చేసిన పాపాలు పోతాయా?

రాజంపేట అర్బన్, జూలై 23, ప్రభాతవార్త:

రికార్డులు కాల్చివేసినంత మాత్రాన నాయకులు, అధికారులు చేసిన పాపాలు కాలిపోవని రాజంపేట పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షులు లక్ష్మి నారాయణ అన్నారు. దొంగ రికార్డులు సృష్టించి అధికారులు సహకారంతో వందల ఎకరాల భూమిని దోచిన ఏ నాయకుడు చట్టం నుండి తప్పించు కోలేరని, ఏదో ఒక రోజు పాపం నుండి జైలుకు వెళ్లి శిక్ష అనుభవించే రోజు వస్తుందని వ్యాఖ్యానించారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డుల దహణం పట్ల స్థానిక బార్ అసోసియేషన్ వద్ద న్యాయవాదులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.నాసరుద్దీన్, సీనియర్ న్యాయవాదులు సింగంశెట్టి కృష్ణ కుమార్, కేవి రమణ, రమేష్‌నాయుడు, ఎం.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### వార్త కు స్పందన

## మహబూబ్‌నగర్‌లో తాత్కాలిక మరమ్మతులు

బద్వేలు, జూలై 23 ప్రభాతవార్త :

పట్టణంలోని మహబూబ్‌నగర్‌లో వర్షంధాటికి ప్రజలు పడుతున్న ఇబ్బందులపై అభివృద్ధి అంటే ఇదేనా.. పేరుతో మంగళవారం వార్త పత్రికలో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విధితమే. ఇందుకు స్పందించిన అధికారులు మహబూబ్ నగర్‌లో మట్టినితోలి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అలాగే అందుకు అనుగుణంగా ఉన్న ఆర్టీసీ బస్టాండు వద్ద కాలువలను శుభ్రం చేయడంతో అక్కడి ప్రజలు ఉపశమనం పొంది సంతోషం వ్యక్తం చేశారు. అలాగే ఇలా తాత్కాలికంగా గాక తమకు శాశ్వత పరిష్కారం చూపాలని మహబూబ్‌నగర్‌వాసులు కోరుతున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు వర్షాకాలంలోను మరియు ఎండాకాలంలో ఇబ్బందులు పడి అనారోగ్యానికి గురైనా పట్టించుకునే నాథుడేలేడు. వర్షాకాలం వచ్చిందంటే వర్షపునీరు, మురికినీటితో ఇబ్బంది పడే ప్రజలకు ఎండాకాలంలో పై నుంచి వచ్చే డ్రైనేజీ నీటితో ఇంటి ఆవరణమంతా మురికిమయం అవతుంది. దీంతో ప్రజలు ఎవరికీ చెప్పుకోలేక గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలు సతమతమవుతున్నారు. అటు ప్రజాప్రతినిధులు పట్టించుకోక , ఇటు అధికారులు పట్టించుకోక నానా ఇబ్బందులు పడే ప్రజలకు కొద్దిగా ఉపశమనం దొరికింది. గత 5 సంవత్సరాలుగా వైసీపీ అధికారంలో ఉండి పాలకవర్గం వైసీపీ అయినప్పటికీ కూడా ఆ వార్డు టీడీపీ కైవసం చేసుకుందని కేవలం కక్షతో వందల కుటుంబాలను మురికిమయం చేశారు. అభివృద్ధి చేయకపోయినా పర్వాలేదు గాని, ఇంటిచుట్టూ ఉండే మురికిని అయినా తీసివేయాలని పదేపదే విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం అధికారులు స్పందించి తాత్కాలిక ఉపశమనాన్ని కల్పించారని ప్రజలు పేర్కొంటున్నారు.

## రామసముద్రంలో వర్షం

రామసముద్రం, జులై 23 ప్రభాతవార్త :

రామసముద్రం మండలంలో మంగళవారం సాయంత్రం మోస్తాదు వర్షం కురిసింది. నాలుగైదు రోజులుగా వాతావరణంలో మార్పులతో మబ్బులు కమ్ముకొని ఉండేది. ఇవాల వర్షం కురవడంతో వేరువెనగ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిరుజల్లుల కారణంగా వాహన రాకపోకలకు కొంత ఇబ్బంది ఏర్పడింది.








